# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
ఆదివారం
22-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 272
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa


## నా వ్యాఖ్యలపై దుష్ప్రచారం

అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ స్పందన



రాహుల్‌గాంధీపై కర్ణాటక బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసులకు ఫిర్యాదు

వివరాలు 7లో



## సీఎం పీఠంపై ఆతిశీ

ఢిల్లీ సీఎంగా ఆతిశీ ప్రమాణం

ఆమెతో ప్రమాణం చేయించిన ఎల్జీ వీకే సక్సేనా..

ఢిల్లీ సీఎంగా అతిపిన్న వయస్కురాలు ఆమె

ఢిల్లీకి 3వ మహిళా సీఎం.. దేశంలో 17వ మహిళా సీఎం

ప్రమాణం తర్వాత కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం

వివరాలు 7లో



## అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ

క్వాడ్ సదస్సులో బైడెన్‌తో మోదీ సమావేశం

సోమవారం వరకూ మోదీ బిజీ షెడ్యూల్

మెరుగైన రేపటి కోసం బహుళపక్ష పరిష్కారాలు సదస్సు లక్ష్యం

విమానాశ్రయం వద్ద ప్రధాని మోదీకి అభిమానులు ఘన స్వాగతం

వివరాలు 7లో

# ఇది బీజేపీ కుట్ర..

## కలిసి పోరాడదాం రండి..: సీఎం రేవంత్



జమిలి ముసుగులో దేశాన్ని కబళించే కుట్ర!

ఆధిపత్యం చెలాయించేందుకే బీజేపీ ప్రయత్నం

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న మోదీ సర్కారు

రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి దారుణంగా మాట్లాడినా ప్రధాని మోదీ ఖండించలేదు

ఏచూరి ఉండి ఉంటే ఇలాంటి వాటిపై పోరాడేవారు

ఇలాంటి సమయంలో సీతారాం ఏచూరి లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటు

ఏచూరి సంస్మరణ సభలో సీఎం రేవంత్

వివరాలు 2లో..

## వంద నియోజకవర్గాల్లో ఐటీఐలు..



స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఏటీసీలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు

మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా కోర్సుల్ని ప్రారంభించాలి

కార్మిక శాఖ సమీక్షలో సీఎం రేవంత్

వివరాలు 2లో..

## ఏచూరితో మాబంధం రక్త సంబంధం

అసలుసిసలైన హైదరాబాద్ బిడ్డ సీతారాం ఏచూరి

నమ్మిన సిద్ధాంతం కోసం కడదాకా నడిచిన కమ్యూనిస్ట్

నేతలు ఏ పార్టీ మారుతారో తెలియని రోజుల్లో విపక్షాల్ని కలిపిన ఘనత ఏచూరిది

రవీంద్రభారతి సంస్మరణలో పాల్గొన్న కేటీఆర్

ప్రమాదంలో ప్రజాస్వామ్యం: బీవీ రాఘవులు

వేర్వేరు సమయాల్లో సభకు హాజరైన సీఎం రేవంత్, కేటీఆర్



వివరాలు 2లో..

## త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

కొండా లక్ష్మణ్ బాపూజీకి సీఎం రేవంత్ నివాళి

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని 27న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటన



2

## మీ స్థాయికి తగ్గ మాటలు కావు

కాంగ్రెస్ నేతలు అర్బన్ నక్సల్సా?

దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

కాంగ్రెస్ మొదటి నుంచి ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉంది

మోడీ వ్యాఖ్యలకు భట్టి కౌంటర్



హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్) : విద్వేష రాజకీయాలకు పునాది బీజేపీ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గొంతెత్తిన వాళ్లను దేశ ద్రోహులుగా, అర్బన్ నక్సల్స్‌గా ముద్రించి నిర్బంధ పాత్ర పోషిస్తున్నదే బీజేపి అన్నారు. 'కాంగ్రెస్ పార్టీని నడిపిస్తున్నది అర్బన్ నక్సల్స్, తుక్డే తుక్డే గ్యాంగ్' అంటూ మహారాష్ట్ర పర్యటనలో ప్రతిపక్షంపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, గాంధీ కుటుంబానిదన్నా రు. కాంగ్రెస్ మొదటి నుంచి ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉందని, అర్బన్ నక్సల్స్ అంటూ ప్రధాని మోడీ విద్వేషపూరిత వ్యాఖలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. దేశ సమగ్రత, సమైక్యత విషయంలో ఎంతో చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని అవినీతిపరులు, మిగతా 2లో...

## అమృత్ టెండర్లలో భారీ కుంభకోణం



2

సీఎం బావమరిదికి రూ.8,888కోట్ల టెండర్!

కేంద్ర ప్రభుత్వ 'అమృత్' పథకంలో భారీ అక్రమాలు

అర్హతలు లేకపోయినా సృజన్‌రెడ్డి సంస్థకు కాంట్రాక్టు

కేంద్రం స్పందిస్తే రేవంత్‌రెడ్డి పదవి పోవడం ఖాయం

ఎన్నికల వేళ ఆర్ఆర్ ట్యాక్స్‌పై మోదీ వ్యాఖ్యలు..

మేం ఆధారాలతో చెప్తున్నాం చర్యలు తీసుకోండి..

అది ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ: కేటీఆర్



## నారీ శక్తికి తిరుగులేదు

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

అఖిల భారత మహిళా అధ్యాపకుల సదస్సులో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

స్త్రీ విజయం వెనుక పురుషుల సహకారం

రాజ్యసభ సభ్యురాలు సుధా మూర్తి

వివరాలు 7లో



## అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం!

నిరూపించకపోతే.. కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు

రూ.8,888 కోట్ల అవినీతి ఎక్కడో చర్చిద్దాం

పోలింగ్ ముందురోజు టెండర్లు తెరిచింది మీరు

3 కంపెనీలకు 4శాతం అదనానికి కట్టబెట్టారు

వివరాలు 2లో

మేం వచ్చాక రద్దు చేసి 2.44శాతం తక్కువకే ఖరారు

సృజన్‌రెడ్డి రేవంత్‌కు సొంత బావమరిది కాదు

బీఆర్ఎస్ సొంత మనిషి, కందాళ అల్లుడు

కేటీఆర్‌పై రెవెన్యూ మంత్రి పొంగులేటి ధ్వజం

## 28న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రాష్ట్రపతి రాకతో ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష

వివరాలు 2లో







నాణ్యమైన నెయ్యి అందిస్తాం

టీటీడీకి స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు అందించేందుకు విజయ డెయిరీ సిద్ధం

టీటీడీ ఇవోకు ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ లేఖ

# ఇది బీజేపీ కుట్ర..



**హైదరాబాద్, సెప్టెంబరు 21(మనం న్యూస్):** జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఎన్నికలను అడ్డుపెట్టుకొని దేశంలో ఆధిపత్యం చెలాయించాలనే కుట్ర చేస్తోందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సీపీఎం నిర్వహించిన ఆ పార్టీ దివంగత జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. బీజేపీ నుంచి రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి కీలక సమయంలో సీతారాం ఏచూరి మన మధ్య లేకపోవడం దేశ రాజకీయాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఏచూరి స్ఫూర్తితో జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో ముందుకు సాగుదామని రేవంత్ పిలుపునిచ్చారు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం రాజ్యాంగ సవరణలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భారతదేశం రాష్ట్రాల సమ్మిళితమని, ఆ స్ఫూర్తిని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యర్థులైనా.. దేశంలో బీజేపీని ఎదిరించడానికి రెండు పార్టీలు కలిసి పనిచేసేలా సీతారాం కృషి చేశారని తెలిపారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిలించడంతోపాటు ప్రజాస్వామిక వేదికలపై మన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని రేవంత్ కొనియాడారు. బ్రతికి ఉన్నంతకాలం పేదల కోసమే పోరాడారని, మరణానంతరం కూడా ఆయన దేహాన్ని ప్రజాప్రయోజనాల కోసం వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించడం ఎంతో గొప్ప నిర్ణయమన్నారు. యూపీఏ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లులకు మద్దతు తెలపడంలో ఏచూరి క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. రాహుల్ గాంధీ ఏచూరిని తన మార్గనిర్దేశకుడిగా భావిస్తారని తెలిపారు. మోదీ క్యాబినెట్‌లో ఉన్న ఓ మంత్రి.. రాహుల్‌గాంధీపై దారుణంగా వ్యాఖ్యలు చేసినా ప్రధాని ఖండించకపోవడం బీజేపీ ఫాసిస్టు విధానాలకు నిదర్శనమన్నారు.

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. దేశంలోని విపక్ష పార్టీల మధ్య విభేదాలున్నా కలిసి పనిచేయాలంటూ వాటిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత సీతారాం ఏచూరిదని అన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని, రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తే దేశం సమైక్యంగా ఉండదని తెలిపారు.

నేరస్తులను శిక్షిస్తే ఖర్చు పెరుగుతుందని.. చంపేస్తే ఖర్చు మిగులుతుందని హిట్లర్ చెప్పినట్లు ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న జమిలి ఎన్నికల ప్రయోగం కూడా ఇదే తరహాలో ఉందన్నారు. కాగా, సీతారాం ఏచూరి ఆశయాలకు పునరంకితం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పార్టీల పరంగా తాము వేర్వేరు అయినా.. తమ సొంత నాయకుడు మరణించారన్నంత బాధ ఉందని అన్నారు. ఇటీవల ఏపీ ఎన్నికల సమయంలో సీతారాం ఏచూరితో కలిసి ప్రచారంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. రాజ్యాంగ విలువలకు పాతరేస్తున్న ఈ తరుణంలో ఏచూరి లేకపోవడం వెలితిగా ఉందన్నారు. పార్లమెంట్లో ఆయన ప్రసంగాలు దేశానికి గొప్ప సందేశాన్నిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ నేత పోటు రంగారావు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి మేనమామ మోహన్ కందా, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి పాల్గొని మాట్లాడారు. కాగా, వేదికపై కుర్చీ విషయంలో సీఎం సెక్యూరిటీ సిబ్బంది వ్యవహరించిన తీరుపట్ల మల్లు రవి అసహనం వ్యక్తం చేశారు.

### వేర్వేరు సమయాల్లో హాజరైన రేవంత్, కేటీఆర్

సీతారాం ఏచూరి సంస్మరణ సభకు ప్రత్యర్థి పార్టీల నేతలైన సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేర్వేరు సమయాల్లో హాజరయ్యారు. ప్రస్తుతం రెండు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రేవంత్, కేటీఆర్ ఒకే వేదికపైకి రావడం ఆసక్తి రేకెత్తించింది. ఇరు పార్టీల కార్యకర్తలు రవీంద్రభారతికి భారీగా చేరుకున్నారు. అయితే కేటీఆర్ ఉదయం 11:30 గంటలకు వచ్చి.. తన ప్రసంగం మగిసిన వెంటనే వెళ్లిపోయారు. ఆ తరువాత మధ్యాహ్నం 12:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు.

# ఏచూరితో మా బంధం రక్త సంబంధం



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** అసలుసిసలైన హైదరాబాద్ బిడ్డ సీతారాం ఏచూరీ అని బిఆర్ఎస్ నేతల కేటీఆర్ పేర్కొన్నారు. కామ్రేడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీతారాం ఏచూరిని ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. ఓట్ల రాజకీయంలో వెనుకబడినా.. తాము ప్రజల కోసం పోరాటంలో ముందున్నామని చాటిచెప్పిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కేటీఆర్ అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. సీతారాం ఏచూరి గొప్పదనాన్ని కీర్తించారు. ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డలుగా ఏచూరీతో మాబంధం రక్త సంబంధం అని అన్నారు. నమ్మిన సిద్దాంత కోసం ఆఖరి వరకు పోరాడిన ఏచూరీ జీవితం తమ లాంటి వారికి ఆదర్శం అని పేర్కొన్నారు. ఎప్పుడు కండువా మార్చుతారో తెలియని కాలంలో సీతారాం ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. ఫిరాయింపుల కాలంలో పదవుల కోసం కాకుండా.. సిద్ధాంతం కోసం పని చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కీర్తించారు. తిట్లు, బూతులు చలామణి అవుతోన్న ప్రస్తుత రాజకీయాల్లో ఏచూరీ రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న కుటుంబంలో పుట్టినప్పటకి.. ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి ఏచూరీ అని.. ఇందిరా గాంధీని రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఏకైక వ్యక్తి అన్నారు. దీన్ని బట్టే సీతారం ఏచూరీ గుండె ధైర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రశ్నించటమే ప్రజాస్వామ్యం అని నమ్మిన వ్యక్తి ఏచూరీ అని కీర్తించారు. పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయాల్లో స్థిరంగా, సిద్ధాంతం కోసం నిలబడ్డ నాయకుడు సీతారాం ఏచూరి కేటీఆర్ తెలిపారు. ఎప్పుడు ఏ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శ నేత ఏచూరి మాత్రమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఓట్ల రాజకీయం వేరు.. ప్రజల రాజకీయం వేరు. మేం ఓట్ల రాజకీయంలో వెనుకబడ్డ ప్రజల కోసం పోరాటంలో మాత్రం ముందున్నాం.. ప్రజల మనసుల్లో ఉన్నామని ఏచూరి చెప్పిన మాట గుర్తుంది. నాయకులుగా, పాలకులుగా ఉండి పోరాడాలంటే తెలియని వారు ఎందరో ఉండొచ్చు. ప్రజలను ఓటు బ్యాంకుగా చూసేవారు మరెందరో ఉన్నారు. కానీ ఉన్నత చదువులు చదువుకున్న ఓ కుటుంబంలో పుట్టి అణగారిన వర్గాల కోసం ప్రశ్నించే గొంతుకగా ఎదిగిన గొప్ప వ్యక్తిత్వం ఏచూరిది. అది చాలా గొప్ప విషయం. పోరాటాల నుంచి వచ్చిన నాయకులకు ప్రజల కష్టం, నష్టం తెలుస్తుందంటారు.. అలాంటి వారిలో ఏచూరి ఒక్కరే అని బలంగా నమ్ముతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

రవీంద్ర భారతిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభ జరిగింది. ఈ సంస్మరణ సభకు కేటీఆర్, కోదండరాం, తమ్మినేని వీరభద్రం, బీవీ రాఘవులు, మోహన్ కందా, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తదితరులు హాజరయ్యారు.

## వంద నియోజకవర్గాల్లో ఐటీఐలు..

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** రాష్ట్రంలో హైదరాబాద్ మినహా వంద నియోజకవర్గాల్లో ఐటీఐ, ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కార్మిక, ఉపాధి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐటీఐ, ఏటీసీలు లేని నియోజక వర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ), అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), పాలి టెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చేలా విధివిధానాలు తయారు చేయాలని సూచించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్‌తో కలిసి కార్మిక, ఉపాధి శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కాలేజీల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐల్లో ప్రారంభించాలని, ఆయా కోర్సులకు అవసరమైన సిలబ్సను రూపొందించాలని ఆదేశించారు. సిలబస్ రూపకల్పనకు ఒక కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తల సలహాలు, సూచనలు స్వీకరించాలని సూచించారు. ఐటీఐ కాలేజీలను పర్యవేక్షించడంతోపాటు, క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రతి ఐటీఐకి ప్రిన్సిపాల్ ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమీక్షలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

## 28న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** ఈ నెల 28వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు రానున్నారు. నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులతో సమావేశమై సమీక్షించారు. ముర్ము తన ఒకరోజు పర్యటన సందర్భంగా నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలియజేశారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారు. శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను కోరారు. అదేవిధంగా, విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. అదేవిధంగా, రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జిహెచ్ఎంసి అధికారులతో సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖను ఆదేశించారు.డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీ ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సీఎండీ టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అమృత్ టెండర్లలో భారీ కుంభకోణం

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్) :** తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కథా చిత్రమ్ నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆధీనంలో ఉన్న పురపాలక శాఖ ద్వారా కేంద్రం అమలు చేస్తున్న 'అమృత్' పథకంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8,888కోట్ల విలువైన టెండర్ను అక్రమంగా కట్టబెట్టారని ఆరోపించారు. రేవంత్ బావమరిది, తమ్ముడికి అమృతం... తెలంగాణ ప్రజలకు విషం అన్నట్లుగా అమృత్ టెండర్ల వ్యవహారం ఉందన్నారు. తెలంగాణ భవన్లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అమృత్ టెండర్లలో సీఎం కుటుంభం అవినీతికి పాల్పడిందనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్‌డ్డికి సంబంధించిన శోధా కన్స్ట్రక్షన్ లిమిటెడ్‌కు అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ''మాకు అందిన సమాచారం ప్రకారం మొత్తం 8 ప్యాకేజీల్లో టెండర్లు ఖరారయ్యాయి. నిర్మల్, నల్లగొండ, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో ఈ ప్యాకేజీల కింద పనులు జరిగాయి. ప్రస్తుతం ఒక్క ప్యాకేజీలోని అక్రమాలనే మేం బయట పెడుతున్నాం. ఇందులో సీఎం స్వయంగా జోక్యం చేసుకుని ఇండియన్ హ్యూమ్ పైప్ (ఐహెచ్‌పీ) అనే కంపెనీకి రూ.1137కోట్ల విలువైన టెండర్ను కట్టబెట్టారు. కానీ.. ఆ కంపెనీ తాము 20%పనులే చేస్తామని, మిగతావి వేరే కంపెనీ చేస్తుందని.. పేర్కొంటూ సెబీకి సమాచారం ఇచ్చింది. ఐహెచ్పీని శిఖండిలా అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి, సూదిని సృజన్‌రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు''అని విమర్శించారు. గత ఏడాది కేవలం రెండు కోట్ల లాభాలు సాధించిన కంపెనీకి వెయ్యి కోట్లకుపై పనులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. బావమరిది కళ్లలో సంతోషం చూడడం కోసం రేవంత్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని, తన ఇంట్లో లంకె బిందలు నింపుకోవడం కోసం అక్రమ టెండర్లకు తెరలేపారని ధ్వజమెత్తారు. ''ఇవి కేంద్ర ప్రభుత్వం పైసలు. వారు విచారణ జరిపితే అన్ని విషయాలు పూసగుచ్చినట్లు వెలుగులోకి వస్తాయి. వాస్తవానికి బీజేపీ ఎమ్మెల్యేనే ఈ విషయం బయట పెట్టారు. ఆధారాలు దొరికిన తర్వాతే మాట్లాడాలని మేము ఇన్ని రోజులు ఆగాం'' అని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ.. రాహుల్, రేవంత్(ఆర్, ఆర్) ట్యాక్స్ గురించి మాట్లాడారని గుర్తు చేస్తూ.. ఇప్పుడు తాము ఆధారాలతో చెప్తున్నామని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి లేఖ రాశామని, టెండర్లలో జరిగిన అక్రమాలను తేల్చాలని కోరామని తెలిపారు. ఈ అంశంపై కేంద్రం స్పందించి.. చర్యలు తీసుకుంటే రేవంత్ పదవి పోవడం ఖాయమని అభిప్రాయపడ్డారు. ఇక నుంచి ధారావాహికగా ఒక్కో కుంభకోణం వివరాలు వెల్లడిస్తామన్నారు. ముచ్చర్లలో ఏర్పాటు చేసేది ఫోర్త్ సిటీ కాదని, ఫోర్ బ్రదర్స్ సిటీ అని విమర్శించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకంలో అక్రమాలు, హైడ్రా పేరిట బెదిరింపులు... ఇలా అన్ని విషయాలు బయటపెడతామన్నారు.

# అవినీతి నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం!

**హైదరాబాద్, సెప్టెంబరు 21(మనం న్యూస్):** అమృత్ పథకం నిధుల్లో రూ.8888 కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ చేసిన ఆరోపణలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఆరోపణలు నిజమని తేలితే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అబద్ధమని తేలితే కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్లో రాజీనామా చేస్తారా? అని సవాలు విసిరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సచివాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే తక్కువ అంచనాలతో కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలిచిందని చెప్పారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు ఎక్కడికైనా వస్తానని ప్రకటించారు. పరిపాలనా అనుమతి ఇచ్చిందే రూ.3516కోట్లకు అని, పన్నులు, ఇతరత్రా కలిపినారూ.5385 కోట్లు అవుతుందని పొంగులేటి ప్రస్తావించారు. రూ.8,888 కోట్ల ఫిగర్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. నేరుగా నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయా? అని ప్రశ్నించారు. మిడిమిడి జ్ఞానంతో విమర్శలు చేయవద్దని హితవు పలికారు. పదేళ్ల పాటు అబద్దాలతో ప్రజలను వంచించారని, ప్రతిపక్షంలో కూడా అబద్దాలు ఆడితే ఈ హోదా కూడా పోతుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు పురపాలక మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ప్రస్తుత పురపాలక మంత్రి అయిన ముఖ్యమంత్రిపై దురుద్దేశ పూర్వకంగా తప్పుడు ఆరోపణలకు పాల్పడ్డారని, వాటిని నిరూపించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. పరువునష్టం దావా కూడా వేస్తామన్నారు. రాష్ట్రంలో 98 ప్రాంతాల్లో పనులు చేసేందుకు 2023 సెప్టెంబరు 20న గత ప్రభుత్వం టెండర్లు పిలిచిందని పొంగులేటి తెలిపారు. తెల్లవారితే పోలింగ్ ఉండగా నవంబరు 29న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే రూ.3,515 కోట్ల బిడ్ను ప్రభుత్వం తెరిచిందని చెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే లోపే 3.99 శాతం అదనానికి మూడు కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. మూడింటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్ వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ అని, మరొకటి గజా కన్‌స్ట్రక్షన్, మూడోది మేఘా అని తెలిపారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రీ టెండర్లు

డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ టెండర్ల విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో వాటిని రద్దు చేసి.. పాత ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారమే మళ్లీ టెండర్లు పిలిచామని పొంగులేటి వెల్లడించారు. కేఎన్ఆర్ జాయింట్ వెంచర్, ఇంకొకటి ఏఎమ్మార్ ఇండియా లిమిటెడ్, సోదా కంపెనీలకు టెండర్లు దక్కాయని వివరించారు. కేటీఆర్ ఆరోపించినట్లు సోదా కంపెనీ ఎండీ సృజన్రెడ్డి సీఎం సొంత బావమరిది కాదని తెలిపారు. గతంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి మారినందుకు అల్లుడు సృజన్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి పనుల్లో రూ.2,300 కోట్ల విలువ జేసే 7వ ప్యాకేజీ పనులు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు.

నిజానికి సృజన్‌రెడ్డి కేటీఆర్‌కు దగ్గరి మనిషి అన్నారు. సృజన్‌రెడ్డి మామ కందాళ ఉపేందర్‌రెడ్డి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో పాలేరు నుంచి తన మీద పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో 3.99 శాతం అదనపు అంచనాలతో టెండర్లు పిలిస్తే తమ ప్రభుత్వం దాన్ని 2.44 శాతానికి తగ్గించి టెండర్లు ఖరారు చేసిందన్నారు. గత పాలకులు చేసిన దానికంటే రూ.57 కోట్లు తక్కువకే టెండర్లు ఇచ్చామన్నారు. వారికి టెండర్లు ఇచ్చేందుకు సీఎం ఎవరిని టెండర్లు వేయవద్దని కానీ, ఎవరిని బెదిరించింది కానీ లేదన్నారు. నిబంధనల మేరకే పనులు అప్పగించామన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

**రోడ్లను ముంచేసిన వరద భారీ ఎత్తున ట్రాఫిక్జాం**

**లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి పోటెత్తిన నీళ్లు**

**మరో 4 రోజుల పాటు భారీ వర్షాలు.. ఎల్లో అలర్ట్**

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** ఉరుము తీవ్రమే.. మెరుపూ తీవ్రమే! ఈ రెండింటినీ తలదన్నేలా వాన!! ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్టుగా భారీగా కురిస్తే వాన మొదలైన క్షణాల్లో వరద పోటెత్తింది. పార్క్ చేసిన బైక్లు కొట్టుకుపోతాయేమో అన్నట్టుగా.. కార్లు సగం దాకా మునిగిపోయేలా వరద ఉధృతి కొనసాగింది. ఏది రోడ్డో... ఏది గుంతో.. ఏది కాలువో తెలియనంతగా ఎటు చూసినా వరద కుమ్మేసింది. హైదరాబాద్లో శనివారం సాయంత్రం వరుణుడి ప్రకోపమిది! గంటకుపైగా వర్షం దంచికొట్టింది. ప్రధాన రాహదార్లలో మోకాలి లోతులో నీళ్లు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలదైతే మరీ దయనీయ స్థితి. బస్తీలు, కాలనీల్లోకే కాదు.. ఇళ్లలోకి వరద పోటెత్తింది. ఖైరతాబాద్‌లోని ఎంఎస్మక్తా, బేగంపేట బ్రాహ్మిణివాడి, లంగర్‌హౌస్, యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ బి-బ్లాక్, లక్ష్మీనర్సింహనగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి వరదనీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌస్‌లో 9.1, ఖైరతాబాద్ గణాంకభవన్ వద్ద 8.6 సెం.మీ వర్షపాతం నమోదైంది.. బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి ప్రధాన రహదారిలో కిలోమీటర్ ప్రయాణానికి గంటకుపైగా సమయం పట్టింది. రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోవడంతో తొలగించేందుకు జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగి వరదనీటిని తొలగించాయి. వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు నెలకొనడంతో చీకట్లు కమ్ముకున్నాయి. ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో ఎక్కువ మంది మెట్రోను ఆశ్రయించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల వర్షం పడింది. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, మహబూబాద్ జిల్లాల్లో వర్షం పడింది. పిడుగుపాటుకు ఆదిలాబాద్ జిల్లా బేలలో రాథోడ్ అవినాశ్ (22) యువ రైతు మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం దిగ్వాల్లో 9.8 సెం.మీ వర్షపాతం నమోదైంది.

### మరో నాలుగు రోజులు వర్షాలే..

రాష్ట్రానికి మళ్లీ భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈనెల 25 వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం కారణంగా 23న వాయవ్య, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.

## త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. తన నివాసంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు నిరంతరం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారన్నారు. కాగా, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఈ నెల 27న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## మీ స్థాయికి తగ్గ మాటలు కావు

మొదటి పేజీతరువాయి...

విభజన వాదులు, అర్బన్ నక్సలైట్‌లు అనడం ప్రధాని స్థాయికి తగ్గ మాటలు కావు అని భట్టి మండిపడ్డారు. గాంధీ నడయాడిన వార్ధా కేంద్రంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఓట్ల కోసం సీట్ల కోసం దేశంలో మత విద్వేషాలు రాజేసేది కేవలం బీజేపీ పార్టీ మాత్రమే, ఇది ప్రజాస్వామిక స్ఫూర్తికి మంచిది కాదని హితవు పలికారు. ఈ దేశం లో మోడీ అమలు పరుస్తున్న ప్రజాస్వామిక వ్యతిరేకత ప్రశ్నించే క్రమంలోనే రాహుల్ గాంధీ దేశం మొత్తం భారత్ జోడో యాత్ర చేసిన విషయం మర్చిపోవద్దని, జోడొ యాత్ర లక్ష్యమే దేశంలో పెచ్చరిల్లిన మత విద్వేషం, రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామిక విలువల పునాదిగా బయలుదేరిందని గుర్తు చేశారు. ఈ దేశంలో బీజేపీ చేస్తున్న మత, విద్వేష, అబద్దాల రాజకీయాలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని ధ్వజమెత్తారు.

### అమెరికాకు పయనమైన భట్టి

అమెరికా పర్యటన నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టి బయలుదేరి వెళ్లారు. శనివారం ఉదయం తొలుత ఢిల్లీకి వెళ్లిన ఆయన అక్కడి నుంచి యూఎస్‌కు వెళ్లనున్నారు. అమెరికాలో జరుగుతున్న మైనింగ్ ఎక్స్ పో, గ్రీన్ పవర్ రంగాల్లో అధునాతన పద్ధతులుపై డిప్యూటీ సీఎం, అధికారుల బృందం వారం రోజుల పాటు అధ్యయనం చేయనుంది. ఈ పర్యటనలో భాగంగా పలు సంస్థలతో తెలంగాణలో పెట్టుబడుల విషయంపై కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయి.

## ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడండి

**పీఏసీ సభ్యులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచన**

**అరికెపూడి అధ్యక్షతన జరిగిన తొలి సమావేశం**

**హైదరాబాద్, సెప్టెంబరు 21(మనం న్యూస్):** ప్రభుత్వ నిధుల వ్యయంలో అవకతవకలు, లోపాలు ఎత్తి చూపుతూ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలంటూ అసెంబ్లీ ప్రజా పద్దుల కమిటీ(పీఏసీ) సభ్యులకు స్పీకర్ ప్రసాద్ కుమార్ సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడాలన్నారు. అసెంబ్లీలోని కమిటీ హాల్లో శనివారం పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇందులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఉద్దేశించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. పీఏసీ బాధ్యతలు మిగిలిన కమిటీలతో పోలిస్తే భిన్నంగా ఉంటాయన్నారు. ఈ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖలపైనా సమీక్ష నిర్వహించవచ్చునన్నారు. కాగా, పీఏసీ కమిటీకి తనను చైర్మన్‌గా నియమించినందుకు గర్వంగా భావిస్తున్నానని అరికెపూడి గాంధీ అన్నారు. పార్టీలకతీతంగా, నిష్పక్షపాతంగా పని చేస్తూ లక్ష్యాలు సాధించడంలో సమష్టిగా కృషి చేస్తామన్నారు. కాగా, పీఏసీ తొలి సమావేశాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అరికెపూడిని చైర్మన్‌గా ఎలా నియమిస్తారని మంత్రి శ్రీధర్ బాబును పీఏసీ సభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు నిలదీశారు. తాము అడిగిన ప్రశ్నలకు పీఏసీలో ఎలాంటి సమాధానం చెప్పడం లేదని, అందుకే వాకౌట్ చేశామని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. మరోవైపు.. పీఏసీ ఔన్నత్యాన్ని తగ్గించేందుకు బీఆర్ఎస్ సభ్యులు కుట్ర చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు.

# ప్రధాన రోడ్ల వెంబడి అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తాం

- కొంతమంది మున్సిపల్ అధికారులకు చేతులు తడుపుతున్నట్లు ఆరోపణలు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు

**కోదాడ,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** ఇటీవల కురిసిన భారీ వర్షంతో కోదాడ పట్టణంలో వరద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. పట్టణంలోని ప్రతి కాలనీలో వరద తీవ్రత కనిపించి,అనేకమంది ఇండ్లలో నీరు చేరి హరిగోసపడ్డారు.ఇద్దరు ప్రాణాలు కోల్పోగా అనేక మంది ఆర్థికంగా నష్టపోయారు.దీనికి కారణం అక్రమ నిర్మాణాలతో పాటు,పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ కాల్వ పూర్తిగా చెత్త చేరి సరిగా నీళ్లు పోవడం లేదని పలు మార్లు ప్రచారమాధ్యమాలలో రాగా మున్సిపల్ అధికారులు పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టినారు అదే సమయంలో వరదలు రావడంతో డ్రైనేజీలో నీరు ప్రవహించడానికి వీలు లేకపోవడంతో,వరద నీరు రహదారుల వెంట ఇండ్లలోకి చేరాయని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.దీంతో అలర్ట్ అయిన మున్సిపల్ అధికారులు ప్రధాన డ్రైనేజీ కాల్వ పూడికతీత పనులు చేపట్టారు.పట్టణంలోని హుజూర్ నగర్ రహదారి వెంట ఉన్న వివిధ దుకాణాలు షాపింగ్ కాంప్లెక్స్ ల ముందర డ్రైనేజీ పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేశారు.కానీ షాపింగ్ కాంప్లెక్స్ ల ముందు ఉన్నటువంటి మెట్లను నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజ్ పై మెట్లను నిర్మించారు.వాటిని మాత్రం మున్సిపల్ అధికారులు తొలగించకుండా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు.కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టి మెట్లు నిర్మించారు.మరి కొంతమంది డ్రైనేజీ పైనే ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మెట్లు నిర్మించారు. కానీ అధికారులు ఈ మెట్లు తొలగించకుండా,వదిలేస్తూ ఉండడంతో మెట్ల కింద నిల్వ ఉన్న చెత్త వల్ల డ్రైనేజీ మళ్లీ ఊడిపోతున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు తెలిసి కూడా ఇలా చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని పట్టణ ప్రజల ప్రశ్నిస్తున్నారు.దుకాణదారులు,షాపింగ్ కాంప్లెక్స్ ల యజమానులతో కొంతమంది అధికారులు లాలూచీ పడుతున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కట్టిన మెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.






### గత అధికారుల పని తీరుతోనే అక్రమ కట్టడాలు..!

కోదాడ పట్టణంలో గత అధికారుల పనితిరుతోనే అక్రమ కట్టడాలు ఏర్పాటు అయ్యాయని పట్టణ ప్రజలు అంటున్నారు.కోదాడ పట్టణం మొదట గ్రామ పంచాయతీ గా ఏర్పడిన తరువాత కాలక్రమేణా మున్సిపాలిటీగా ఏర్పడింది.నాటి అధికారుల పని పనితిరుతోనే అక్రమ కట్టడాలు నిర్మించారు అని ప్రజలు అంటున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరుతున్నారు.

### నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం:మున్సిపల్ కమిషనర్ ఎ.రమాదేవి

గతంలో ప్రజలు అక్రమంగా డ్రెయినేజీ నిర్మాణాలపై మెట్లు నిర్మించిన వారికి నోటీసులు జారి చేసి చర్యలు తీసుకుంటాం.పట్టణ ప్రజలు ఎవరైనా పర్మిషన్ తీసుకున్న నిబంధనల మేరకు కట్టడాలు నిర్మించుకోవాలి. డ్రెయినేజీ వంటి నిర్మాణాలపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు.ఇటీవల పట్టణంలో వచ్చిన వరదలకు అక్రమ కట్టడాలు ప్రధాన కారణం. కావున ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని అన్నారు.

## బాసాని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత



**వలిగొండ, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో బాసాని సత్యయ్య, గ్రామపంచాయతీ మాజీ వార్డు మెంబర్ బాసాని శీను, తండ్రి బాసాని నరసింహ పరమపదించారు. వారి పార్థివ దేహాన్ని సందర్శించి వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి ధైర్యం చెప్పి 5000 రూపాయల ఆర్థిక సహాయం డిసిసి ఉపాధ్యక్షుడు వాకిటి అనంత రెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ, కార్యదర్శి కొడితాల కరుణాకర్, బండారి నర్సింహ రెడ్డి, దామెర అంజయ్య, బుర్ర శ్రీశైలం, మర్రి ముత్యాలు, సుంకిశాల పరమేశ్, వేముల ఎట్టయ్య, జక్కిడి సాయి రెడ్డి, నర్సిరెడ్డి, రెబ్బసు నరేశ్, చిలకమర్రి శ్రీను, ఉపేందర్, రేఖ మత్స్యగిరి, వేముల నర్సింహ, కసిరబోయిన మహేష్, ఎలిమినేటి పెంటయ్య యాదగిరి శంకరయ్య , క్యాదరి బిక్షం, పందిరి సంపత్, బోగరం ఎల్లయ్య మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**వలిగొండ, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** వలిగొండ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 112వ వర్ధంతి కార్యక్రమాన్ని పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సాయిని యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ పరితపించే వాడని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో అన్ని వర్గాలను ఏకం చేసి ముందు నడిచిన గొప్ప వ్యక్తి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గంజి శ్రీనివాస్, ఎక్కడ దేవి శ్రీను, సంతోష్, జగన్మోహన్, లక్ష్మయ్య, ఈశ్వర్, రాఘవేందర్, రవి, గ్రంధాలయ ఇన్చార్జి పిటల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి మహిళ మృతి

**తిరుమలగిరి, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళా మృతి చెందిన సంఘటన వెలిశాల గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బుర్రి రాజమ్మ (53) బర్లను మేపడానికి వెళ్ళగా బర్లు చెరువులోకి వెళ్ళగా వాటిని బయటకు వెళ్లగొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారని తెలిపారు.


# మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన సదస్సు




**నల్లగొండ,సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డీగ్రీ ( మహిళల ) కళాశాల చర్లపల్లి నల్గొండ రూరల్ నందు మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమం మాదకద్రవ్యాల దుర్వినియోగము అక్రమ రవాణాపై నిర్వహించడం జరిగింది. డి.ఎస్.పి శివరాం రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈ సందర్భంగా శివరాం రెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలు గంజాయి బారిన పడి వారి యొక్క భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారని ప్రభుత్వం వివిధ శాఖల సమన్వయంతో నషాముక్త భారత్ అభియాన్ కింద నల్లగొండ జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా జిల్లా యంత్రాంగం నడుం బిగించి కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా యువత మత్తు పదార్థాలు గంజాయి వాడినట్లయితే వారి పైన కఠిన శిక్షలు ఉంటాయని యువత వాటికి దూరంగా ఉండాలని మన జిల్లాలో టెస్టింగ్ ఇట్లు అందుబాటులో ఉన్నాయని యువత మాదకద్రవ్యాలకు దూరంగా తమ చదువులను కొనసాగించాలని వారి భవిష్యత్తుని అంధకారంలోకి నెట్టివేసుకోకూడదని విద్యార్థినిలకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా జిల్లాలో డి అడిక్షన్ సెంటర్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం కోసం ప్రయత్నం జరుగుతుందని ఇట్టి అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి,,రూరల్ సైదా బాబు, నార్కోటిక్ బ్యూరో బాలవర్ధన్ మరియు కళాశాల ప్రిన్సిపల్ పవిత్ర వాణి కర్ష, భీమనపల్లి శ్రీకాంత్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్స్ భరత్ తేజ, పరశురామ్, రమేష్, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ జలాశయంలో చూపరులను ఆకట్టుకుంటున్న నీటి కుక్కల విన్యాసాలు

**నాగార్జున సాగర్,సెప్టెంబర్ 22(మనం న్యూస్) :** నాగార్జున సాగర్ జలాశయంలో నీటి కుక్కలు సందడి చేస్తున్నాయి క్రస్ట్ గేట్ల దిగువ భాగాన గల జలాశయంలో శనివారం ఇవి దర్శనమిచ్చాయి అక్కడున్న చూపరులను కనివిందు చేస్తున్నాయి. నీటి కుక్కలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయని ఎగువన వర్షాలు పడినప్పుడు, నీళ్లు పెరిగినా లేదా డ్యామ్ లో నీటిమట్టం తగ్గిన సమయంలో జలాశయ పరిసరాల్లో చేపల కోసం ఇవి ఒడ్డుకు వచ్చి విన్యాసాలు చేస్తూ కనువిందు చేస్తుంటాయని నీటి కుక్కలు సాధారణంగా మనిషి కనపడినా,ఏదైనా శబ్దం చేసిన తుర్రుమంటాయని డ్యామ్ అధికారులు చెబుతున్నారు. ఇవి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రభావంతో కొట్టుకొచ్చి ఉంటాయని వారు భావిస్తున్నారు. కాగా జలాశయం అంచు భాగంలో తిరుగుతున్న నీటి కుక్కలను సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇవి జలాశయంలోని చేపలను ఆహారంగా తీసుకుంటాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఎప్పుడో ఒకసారి ఇలా కనిపించి, మళ్లీ జాడ లేకుండా పోతాయని, ప్రస్తుతం నీటికుక్కలు చాలా వరకు కనుమరుగయ్యాయని వాటిని సంరక్షించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.కనిపించిన నీటి కుక్కలను యాత్రికులు తమ సెల్ఫోన్లో బంధించి ఆనందించారు.



# ప్లేట్ లెట్స్ దానం చేయడానికి యువత ముందుకు రావాలి

- జనచైతన్య ట్రస్ట్ సభ్యులు పారా సాయి, పిల్లి శివశంకర్



**హుజూర్ నగర్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** రక్తదానంతో పాటు ప్లేట్ లెట్స్ కూడా దానంచేయడానికి యువత ముందుకు రావాలని హుజూర్ నగర్ జన చైతన్య ట్రస్ట్ సభ్యులు పారా సాయి,పిల్లి శివశంకర్ అన్నారు.శనివారం మిర్యాలగూడ అపోలో రిచ్ హాస్పిటల్ లో ఓ పాజిటివ్ ప్లేట్ లెట్స్ అవసరమై నందున జనచైతన్య ట్రస్ట్ ను సంప్రదించగా వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు పిల్లి శివశంకర్,పారా సాయి లు ఓ పాజిటివ్ డొనర్ తోటి ట్రస్ట్ సభ్యులైన దగ్గుపాటి రమేష్,ఇంజమూరి జయంత్ లతో మాట్లాడి జ్యోతి బ్లడ్ బ్యాంకు ఓ పాజిటివ్ డొనర్ దగ్గుపాటి రమేష్ 50 వేల ప్లేట్ లెట్స్ అందించారని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ డోనార్ ప్లేట్ లెట్స్ అధునిక సాంకేతికతతో ఒక దాత నుండే ఎక్కువ పరిమాణంలో ప్లేట్ లెట్స్ ను సేకరిస్తారని,ఈ విధానం వల్ల రక్తం నుండి ఇతర అంశాలను వేరు చేసి ఒక్క ప్లేట్ లెట్స్ మాత్రమే సేకరించేందుకు అవకాశం ఉంటుందని,ఒక రోగికి 50 వేల ప్లేట్ లెట్స్ అవసరమనుకుంటే అంతే స్థాయిలో దాత నుండి ప్లేట్ లెట్స్ ను సమీకరించుకోవచ్చని,దాత ప్లేట్ లెట్స్ ను డొనేట్ చేస్తే తిరిగి నాలుగురోజుల వ్యవధిలో భర్తీ అవుతాయని అదే రక్తం దానం చేస్తే తిరిగి రక్తం భర్తీ కావటానికి మూడు నెలల సమయం తీసుకుంటుందని,ప్లేట్ లెట్స్ ఇచ్చే విషయంలో చాలా మందిలో అనేక అపోహలు ఉంటాయని, ఏలాంటి అపోహలకు తావులేకుండా ప్లేట్ లెట్స్ ను ఇచ్చేందుకు ధైర్యంగా ముందుకు రావచ్చని, ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు రక్షించిన వారు అవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజమూరి జయంత్,కుక్కడపు సాయి, చంటి తదితరులు,పాల్గొన్నారు.

# రమా శంకర్ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం

- భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**చండూరు, సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** చండూరు మండలం లోని పుల్లెంల గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకు లు పోలే రమా శంకర్ ఇటీవల ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమా దంలో మృతి చెందారు. డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమా ర్ మరియు బిఆర్ఎస్ నాయ కులు సైదులు శంకరాచారి, నాయకు లతో కలిసి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శి ంచి శ్రద్ధా ంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రమా శంకర్ సేవలను గుర్తుచేస్తూ ఆయన మరణం తీరని లోటని పేర్కొన్నారు. చిన్న వయస్సులో మానుండి దూరమవ డం జీర్ణించుకోలేక పోతు న్నామన్నారు. అతని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, పేద కుటుం బంలో పుట్టిన శంకర్ కుటుంబానికి 50 వేలు రూపాయల అందజేయడంతో పాటు అన్ని విధాలుగా కుటుంబానికి అండ గా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు సైదులు, శంకరాచారి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# పత్తి పంటను పరిశీలించిన కెవికె శాస్త్రవేత్తలు

**తిరుమలగిరి, సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** మున్సి పాలిటీ మాలిపురంలోని రైతు పత్తి చేలో కలుపు మందు పిచి కారి చేయగా పత్తి మొక్కలు చనిపోయినందుకు కేవీకే శాస్త్ర వేత్తలు, వ్యవసాయ అధికారులు రైతు పంట చేనును శనివారం పరిశీలించారు. మాలిపురం గ్రామానికి చెందిన దూలం సోమయ్య ఆగస్టు 1న జనగా లోని జెకెయస్ ఫెర్టిలైజర్ షా పులో పత్తి పంటలో కలుపు నివారణ కోసం మందు తీసుకొచ్చి ఐదు ఎకరాలలో పత్తి పంట చేను లో పిచికారి చేశారు. గడ్డితోపాటు పత్తి మొక్కలు కూడా చనిపోవడంతో రైతు వ్యవ సాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపైన కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్.నరేష్, కిరణ్, ఆదర్శ్లు పత్తి పంటను పరిశీలి ంచారు. ఈ సందర్భంగా తుంగతుర్తి ఏడిఏ బాలు మాట్లాడు తూ పత్తి పంటలో గడ్డి మందు పిచికారి చేసినందుకు రైతుకు జరిగిన నష్టం పై పూర్తి నివేదిక జిల్లా వ్యవసాయ అధికారుల కు అందించి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.వీరి వెంట మండల వ్యవసాయ అధికారి సిహెచ్. నాగేశ్వరరావు రైతులు ఉన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి



**మిర్యాలగూడ,సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలో రాణించి ఆత్మవిశ్వాసంతో అనుకున్న విజయాలను సాధించాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కొనసాగిన వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని కోరారు. చదువు పూర్తయిన వెంటనే స్థిరపడేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ రవి నాయక్, బహుమతుల దాత నవీన్, స్థానిక నేతలు నాగు నాయక్ తదితరులు ఉన్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి



**చిలుకూరు, సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** పిడుగు పాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షం,పిడుగు పాటుకు చిలు కూరు గ్రామంకు చెందిన కొండా ఎల్లయ్య ఇంట్లో చెట్టు కింద ఉన్న రెండు పాడి గేదెలు అక్కడిక్కడే మృతి చెందినాయి.మృతి చెందిన పాడి గేదెల విలువ రూ.1.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.ఈ గేదెల పాడి ద్వారానే కుటుంబం పోషణ జరుగుతుందని తెలిపారు. అదే గేదలు మరణించడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది కలుగుతుందని కావున ప్రభుత్వం నాకు న్యాయం చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కో రారు.

## పిడుగుపాటుకు పిల్లర్ ధ్వంసం



**సూర్యాపేట,సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి) :** పిడుగు పాటుతో ఇంటి పిల్లలు పూర్తిగా ధ్వంసం అయినా సంఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే శనివారం పట్టణంలోని 6 వార్డు హనుమాన్ నగర్ లో నివాసముంటున్న షేక్ మదార్ ఇంటిపై పిడుగు పడటంతో స్లాబు పిల్లర్ కూలడంతో పాటు టీవీ 4 ఫ్యాన్లు పూర్తిగా కాలిపోయాయి అంతేకాకుండా ఈ పిడుగు ప్రభావంతో పక్కనే గల మరో నివాసంలో నాలుగు ఫ్యాన్లు టీవీ దగ్ధం అయ్యాయి. ఊహించని ఈ పిడుగు సంఘటనతో ఒక్కసారిగా బాధితులు లబోదిబోమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటికి పరుగులు తీశారు.పిడుగు ప్రభావంతో సుమారు లక్ష యాభై వేల రూపాయల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి తమను ప్రభుత్వం ఎలాగైనా ఆదుకోవాలని నష్టపోయిన బాధ్యత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

## లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



**ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** ఆలేరు నియోజకవర్గ కేంద్రం వైఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఎం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మంది లబ్ది దారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు, ఓబీసీ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య, తాజా మాజీ సర్పంచ్ జన్నాయి కోడే నగేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, ఎలగందుల శ్రీను, గట్టు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో స్వచ్ఛత హీ సేవపై అవగాహన ర్యాలీ

**భువనగిరి, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం భువనగిరి పట్టణంలోని గాంధీ పార్కు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ కే. శివరామకృష్ణ పాల్గొని పట్టణ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద టైమ్స్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, మహిళలు, పురపాలక అధికారులు, బ్యాంకు అధికారులు మానవ హారం చేసి ప్రతిజ్ఞ చేశారు.

మనం



## సాగర్ ఎడమ కాలువ గండ్లు పూడ్చడంలో ఆలస్యం

- హడావుడి పనులు-అధికారులు బాధ్యతారాహిత్యంతో మరోసారి గండి



**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** నాగార్జునసాగర్ ఎడమ కాలువ పాలేరు రిజర్వాయర్ కింది భాగంలో పడిన భారీ గండిని పూడ్చడంలో అధికారుల బాధ్యతారాహిత్యం, అలసత్వం హడావుడి పనులు మూలంగా మరోసారి గండి పడిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. రైతుల పంటలను ప్రకృతి కాపాడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గండ్లు పూడ్చి ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు పరిధిలో రెండు లక్షల ఎకరాల పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 31 సెప్టెంబర్ 1 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షాలకు సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడినా అధికారులు సకాలంలో స్పందించి డ్యామేజ్ సరిగా అంచనా వేయకపోవడంతో మట్టి కట్ట మాత్రమే కట్టుకు పోయిందన్నారు. మరమ్మతులు ప్రారంభం అలస్యం చేయడం, హడావుడి పనులు తో మరోసారి సాగర్ ఎడమ కాలువ గండ్లు పడిందన్నారు. ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు పంటలు తీవ్ర ఎండల నేపథ్యంలో సాగునీరు లభించక ఎండిపోయే దశకు వచ్చాయని, కొన్ని మండలాల్లో వరి పంట పొట్ట దశలో ఉందని యుద్ధ ప్రాతిపదికన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మరమ్మతులు పూర్తి చేయాలని లేకపోతే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారని అన్నారు. ఆగస్టు 15 ముఖ్యమంత్రి ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టు నీళ్ళు సాగర ఎడమ కాలుకి విడుదల చేసి మధిర సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలో పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.

## రేపట్నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి పర్యటన



**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆది, సోమవారాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ఖమ్మం నగరం ఒకటవ డివిజన్ లోని రైస్ మిల్లు రోడ్డులో, మధ్యాహ్నం 12గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెం రోడ్డు నెంబర్ 8 లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు నేలకొండపల్లి మార్కెట్ యార్డులో జరిగే నేలకొండపల్లి మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అలాగే సోమవారం ఉదయం 08.00 గంటల నుంచి ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు పట్టణం, ఇల్లందు మండలంలోని ముకుందాపురం, మెడికుంట, ఎల్లందుల్ల పాడు, బుగ్గవాగు, బొజ్జాయిగూడెం తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. కావున స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సం ఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

## విజయలో ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్ ఫర్ పైతాన్‌పై ట్రైనింగ్



**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల నందు ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ విభాగం, తెలంగాణ ఎకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ వారిచే సంయుక్తంగా 'ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్ ఫర్ పైతాన్' అనే అంశం మీద మూడు రోజులపాటు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. టాస్క్ రిసోర్స్ పర్సన్ భాను ప్రదీప్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రాం ఇచ్చారు. ప్రస్తుత లీడింగ్లో ఉన్న టెక్నాలజీస్ పైతాన్ ప్రోగ్రాం ప్రాముఖ్యత మీద మూడు రోజులపాటు చాలా విపులంగా ట్రైనింగ్ ఇచాచరు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషా తరుణం మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు(19-21) సక్సెస్ ఫుల్ గా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నిర్వహించామని తెలియజేశారు. ఈ ట్రైనింగ్ ద్వారా విద్యార్థులు పైతాన్ ప్రోగ్రాం అనే లాంగ్వేజ్ మీద ప్రోగ్రామ్ స్కిల్స్ దాని ప్రాముఖ్యతని నిర్మాణాత్మకంగా పరిశోధనాత్మకంగా నేర్చుకోవడం జరిగిందని, విద్యార్థులు చాలా ఉపయోగపడిందని తెలియజేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ డైరెక్టర్ డాక్టర్ అయేషా తరుణం వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 28న జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి

**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతకు ఎంట్రీ లెవల్ కెరీర్ అవకాశాన్ని అందించడానికి అనేక ప్రసిద్ధ దేశీయ, ఎం.ఎన్.సి. యజమానులు, బ్యాంకింగ్ సేవలు ముందుకు వచ్చాయని, ఇందులో భాగంగా సెప్టెంబర్ 28న స్థానిక ఎస్.ఆర్. అండ్ బి.జీ.ఎన్.ఆర్. డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్. మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని మాధవి ఆ ప్రకటనలో తెలిపారు.

# ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- పేరెంట్ టీచర్స్ మీటింగ్ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలలోని ఉపాధ్యాయులు సమన్వయంతో కలసికట్టుగా పనిచేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పేరెంట్, టీచర్స్ మీటింగ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడం కోసం ఉపాధ్యాయులు నిరంతరాయంగా కృషి చేస్తున్నారని, పాఠశాలలో జరుగుతున్న అంశాలను ఉపాధ్యాయులు రెగ్యులర్ గా, వాట్సాప్ లేదా డైరీ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందిస్తారని, పాఠశాలలో ఏం నేర్చుకుంటున్నారో ప్రతి రోజు ఇంటి వద్ద తల్లిదండ్రులు పరిశీలించాలని, ప్రతిరోజు కొంత సమయం ఇంటి వద్ద పిల్లలు చదివే విధంగా చూడాలని కోరారు. ప్రతి రోజు పాఠశాలలో ఇంగ్లీషు, స్పోర్ట్స్ ప్రత్యేకపిరియడ్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.పాఠశాలలో నిర్వహించే పేరెంట్, టీచర్స్ మీటింగ్ లకు తల్లిదండ్రులు రెగ్యులర్ గా హాజరుకావాలని, ప్రతి సబ్జెక్టులో తమ పిల్లల పురోగతి వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలు ఏ సబ్జెక్ట్ లో వెనకబడి ఉన్నారు, అందులో పురోగతి సాధించేందుకు తీసుకుంటున్న చర్యలు గురించి సంబంధిత ఉపాధ్యాయులతో చర్చించాలని కలెక్టర్ అన్నారు.పాఠశాలల్లో ఉన్న వసతులను కూడా పేరెంట్, టీచర్స్ మీటింగ్ సందర్భంగా తల్లిదండ్రులు పరిశీలించాలని, పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పాఠశాలల్లో ఉన్న టాయిలెట్స్, తరగతి గదులు మొదలగు వసతులను పరిశీలించాలని, ఏవైనా సూచనలు ఉంటే తెలియజేస్తే వచ్చే పేరెంట్ టీచర్స్ మీటింగ్ నాటికి సవరించే ప్రయత్నం చేస్తామని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు ముందస్తుగా తప్పనిసరిగా విద్యార్థులను రెగ్యులర్ గా పాఠశాలలకు పంపాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో టిఎల్ఎం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన చేస్తున్నామని, ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా శ్రద్ధ చూపించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పేరెంట్ టీచర్స్ సమావేశం సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలు, ఇతర అంశాలను తల్లిదండ్రుల నుంచి తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో అదనపు టాయిలెట్ల నిర్మాణానికి, ఉన్న టాయిలెట్ లు పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, పాఠశాలలోని టాయిలెట్స్, వంట గది , ఆర్.ఓ. ప్లాంట్ గది, కిచెన్ గార్డెన్ లను పరిశీలించారు. ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి వెంటనే అందుబాటులోకి తీసుకొని రావాలని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయాలి

- గంజాయి రవాణాను అరికట్టడంలో పోలీసుల పని తీరు ప్రశంసనీయం
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా పోలీసు అధికారులతో శనివారం నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదల సమయంలో, గణేష్ నవరాత్రులు,నిమజ్జన కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు చోటుచేసుకోకుండా అంకితభావంతో అహర్నిశలు ప్రజలకు సేవలాందించిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే విధంగా నమ్మకాన్ని కలిగించారని ప్రశంసించారు. కొత్త కొత్త టెక్నాలజీలతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఖాతాల నుండి నగదు మాయం చేస్తున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలకు అనునిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ వారిని అప్రమత్తం చేయాలని తెలిపారు. ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి 'క్వా లిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు.గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలని తెలిపారు.గుట్కా, మట్కా, జూదం, బెట్టింగు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని తెలిపారు. రౌడీషీటర్లు మరియు పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. బహిర ంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధా రణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వ యం పాటిస్తూ నివారణాచర్యలు చేపట్టాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదిలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన పోలీస్ అధికారులు మరి యు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్స్ నాగరాజు, శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి,జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు మరియు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారను చేత పట్టి... పిచ్చి చెట్లను తొలగించి..

- శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (మనం ప్రతినిధి) :** జిల్లాలో ఈ నెల 17 నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా యువజన క్రీడలు, జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రామచంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో క్రీడాకారులకు కావలసిన విశాలమైన స్థలం ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ నిధుల నుండి రన్నింగ్ ట్రాక్, హాకీ కోర్టు, వాలీబాల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సదుపాయాలు సమకూర్చుతామని తెలిపారు.కళాశాలలో పూర్వం చదువుకున్న విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అందరూ సమిష్టిగా పనిచేసి కళాశాల మైదానాన్ని క్రీడాకారులకు మరింత సౌకర్యవంతంగా తయారు చేద్దామన్నారు. కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చి చెట్లు గడ్డి పొదలు, పంచాయతీ సిబ్బందితో పాటు కళాశాల విద్యార్థులు కలిసి తొలగించాలని సూచించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో మహిళలు తడి, పొడి చెత్త వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని దానివల్ల ప్రభుత్వానికి సహాయపడిన వారు అవుతారని అన్నారు. ప్రజలు, అధికారులు శానిటైజషన్ సిబ్బంది సహకారం వల్ల అతి కొద్ది కాలంలో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పరిశుభ్ర జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతే మనందరి బాధ్యతగా ముందుకు సాగాలని అని కలెక్టర్ అన్నారు. కొత్తగూడెం పాల్వంచ పట్టణాల్లోని ఖాళీ స్థలాలు, పార్కులను అభివృద్ధి పరిచి పిల్లలు ఆడుకోవడానికి వీలుగా మారుస్తామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో ప్రజలు ప్రముఖ పాత్రను పోషించేందుకు గాను ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా యువజన క్రీడా అధికారి పరందామ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి చం ద్రమౌళి, విద్యాశాఖ నుండి సైదులు, ఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో బీవీ చలపతి, ఎన్ఎస్ఎస్ అధికారి పూర్ణచందర్, హాకీ కోచ్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# అమృత్ పథకం నిధులతో అభివృద్ధి చేయలేదు

- వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- కొత్తగూడెంలోని చింతల చెరువు ఆక్రమణలపై చర్యలు శూన్యం
- బిజెపి నాయకులు తాండ్ర వినోద్ రావు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (మనం ప్రతినిధి):** అమృత్ పథకం కింద వచ్చిన నిధులతో ఎలాంటి అభివృద్ధీ చేయలేదని బిజెపి నాయకులు ఖమ్మం పార్లమెంట్ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు పేర్కొన్నారు. కొత్తగూడెంలో శనివారం జరిగిన పాత్రికేయ సమావేశంలో తాండ్ర వినోద్ రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 గౌరవ భారత ప్రధాని (నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వరకు సేవా పక్వాడ ప్రోగ్రాంని ప్రారంభించామని, దేశంలో అన్ని ప్రాంతాల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున రక్తదానం, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సెప్టెంబర్ 25 పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ పుట్టినరోజు సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ పెద్ద ఎత్తున చేపడుతున్నామని అన్నారు. ప్రతి మండలం, గ్రామాలలో కి వెళ్లి విస్తృతంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపడతున్నామని, యువతని పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా కార్యక్రమం చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే ప్రారంభమైన మెంబర్షిప్ కార్యక్రమంలో ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ మధ్య కురిసిన అకాల వర్షాలకు చాలామంది రైతులు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని చాలా పంట పొలాలు మునిగిపోయాయని, ప్రజలకు నిలువ లేకుండా వరదలు ముంచెత్తాయని వారు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో ఉన్న ఎన్జీవోలు పూర్తి సహకారం ప్రజలకు అందించాయని, ప్రభుత్వం మాత్రం గట్టు పైన ఉండి చూస్తూ నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించిందని వారు వాపోయారు. కొత్తగూడెం అసెంబ్లీలో ఎలాంటి ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ గాని, పారిశ్రామిక అభివృద్ధి జరగలేదని అన్నారు. పాల్వంచ పట్టణంలో 800 వందల మెగావాట్ల ప్లాంట్ స్థాపన, ఎన్ఎండీసీ ల్యాండ్ లో ఇండస్ట్రీ స్టార్ట్ చేయొచ్చని అన్నారు. అలాగే కొత్తగూడెం పట్టణంలో అమృత్ పథకం కింద వచ్చిన నిధులను పక్కదారి పట్టించారని అన్నారు. అలాగే కొత్తగూడెం నియోజకవర్గం సుజాతనగర్ మండలంలో ఉన్నటువంటి సింగభూపాలెం చెరువు ఆనకట్టకి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, ఆనకట్టపై టూరిజం ప్రాజెక్టు స్టార్ట్ చేయాలని సెంట్రల్ టూరిజం మినిస్టర్ తో మాట్లాడినట్లు తెఇపారు. కొత్తగూడెంలో కోతుల బెడద చాలా ఇబ్బందిగా ఉన్నదని మున్సిపల్ సిబ్బంది దానిపైన దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. పేద ప్రజలకు డబుల్ బెడ్రూం గృహాలు నిర్మించి గాలికి వదిలేశారని అవి శిథిలావస్తకి చేరుకున్నాయని వాటి స్థలంలో కొత్త గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. కొత్తగూడెంలో నాగేశ్వర టాకీస్ దగ్గర ఉన్నటువంటి చింతలచెరువు కుంట ఆక్రమణకు గురైందని, దానికి సంబంధించిన అధికారులపై వెంటనే చర్యలు చేపట్టి చెరువును కాపాడాలని వారు తెలిపారు. ఎర్రుపాలెం రైల్వే స్టేషన్లో శాతవాహన ఎక్స్ప్రెస్ హల్టింగ్ ఇవ్వాలని కేంద్రా రైల్వే శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే చార్మినార్ ఎక్స్ప్రెస్ కూడా మధిరలో హాల్టింగ్ ఇవ్వాలని, మదిర ఓల్డ్ రైల్వే స్టేషన్ దగ్గర అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నరేంద్రబాబాబు, కో కన్వీనర్ బుడగం రవి, నరేంద్రాబాబు, క్రాంతి, జిల్లా మండల తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ఖమ్మం, సెప్టెంబర్ 21(మనం న్యూస్):** ప్రజారోగ్యం పట్ల అప్రమతంగా ఉంటూ విధులు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, కూసుమంచి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది హాజ రు రిజిస్టర్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్, విధులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని, ప్రజల కు మెరుగైన వైద్య సేవలను అందిం చాలని సూచించారు. మండలంలో గర్భిణీ స్త్రీల ఏఎన్సీ రిజిస్ట్రేషన్, ఎన్.సి .డి సర్వే నిర్వహణ, ఫీవర్ సర్వే నిర్వహణ, వైరల్ జ్వరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, తదితర అంశాలను ఆరా తీసిన అదనపు కలెక్టర్ వైద్యాధికారులకు పలు సూచనలు జా రీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా వైద్య అధికారులు, వైద్యసిబ్బంది, తదితరులు ఉన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు



**ఆత్మకూర్(ఎం),సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆమహనీయుని చిత్రప టానికి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెల ంగాణ రాష్ట్రం కోసం ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నోముల యాదగిరి, మండల అధ్యక్షులు ఎలగందుల మహేష్, పెంట శంకరయ్య, వంగ శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, రచ్చ బిక్షపతి, వంగ రిబుచ్చి రాములు, సాయిని బాబు,రచ్చ జ్ఞానేశ్వర్, బొజ్జ వెంకటేష్, సుల్తాన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నగర శివా రులోని నార్సింగి మున్సిపాలిటీలో గండిపేట మండల రెవెన్యూ అధికారులు, నార్సింగి మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝు ళిపించారు. కోకాపేట్ లో సర్వే నంబ ర్ 147లో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మించారు. దీంతో అధికారులు జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. మరోపక్క నార్సింగి మున్సి పాలిటీలోని అక్రమంగా నిర్మించిన భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భవనానికి జి ప్లస్ 2 అ నుమ తులు తీసుకున్న వ్యక్తి జి ప్లస్ 5 ని ర్మాణం చేపట్టాడు. అంటే 3 అంతస్తులు అదనంగా నిర్మించాడు. దీంతో భారీబందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని గండి పేట్ తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# గర్భిణీ మహిళలకు సంపూర్ణ వైద్య సేవలను సమర్ధవంతంగా అందించాలి

- ప్రతి పీ.హెచ్.సి పరిధిలో 100% గర్భిణీ స్త్రీల నమోదు పూర్తి చేయాలి
- బర్త్ ప్లాన్ ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ జరిగేలా చర్యలు
- 102 వాహనాల ద్వారా గర్భిణీ స్త్రీలు పరీక్షల తరలింపు
- జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహణ
- గర్భిణీ మహిళలకు అందే వైద్య సేవలపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి) :** జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణి మహిళకు సంపూర్ణమైన వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రులలో సమర్ధవంతంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గర్భిణీ మహిళలకు అందే వైద్య సేవల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కో య శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణీల నమోదు తక్కువగా ఉందని, వారు పరిశీలించుకుని ప్రతి గర్భిణీ స్త్రీ 100% రిజిస్టర్ అయ్యేలా చూడాలని, గర్భిణీ స్త్రీలు నమోదు కొరకు ఎల్.ఎం.పి లిస్ట్, నవ దంపతుల లిస్ట్ ప్రిపేర్ చేసి వారిని ట్రాక్ చేయాలని కలెక్టర్ సూచించారు.గర్భిణీ మహిళల జాబితా ప్రతి సూపర్వైజర్ వద్ద ఉండాలని, గర్భిణీ స్త్రీలను సూపర్ వైజర్ మానిటరింగ్ చేయాలని, బర్త్ ప్లాన్ రూపొందించుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, కనీసం 80 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 102 వాహనాలను ఉపయోగించుకొని గర్భిణీ స్త్రీలను పరీక్షలకు పంపాల ని, ఏ రోజు ఏ గర్భిణి మహిళలను పరీక్షలకు తీసుకు రావాలో జాబితా తయారు చేసుకోవాలని, ఆ జాబితా ప్రకారం గర్భిణీ స్త్రీలకు తగు పరీక్షలు నిర్వహించుటకు మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం నందు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.ఎం.ఎల్.హెచ్.పి, హై రిస్క్ గర్భిణి కేసులను నెల ముందుగానే ఫాలో అప్ చేస్తూ అవసరమైన సమయంలో వెంటనే 10 8 వాహనంలో మాత శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి తరలించేలా చూడా లని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీ డెలివరీ అయిన వారికి ప్రత్యేక ఏసీ రూములు (రూసుము చెల్లి ంచే) ఉన్నాయని, అవసరమైన వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవా లని కలెక్టర్ తెలిపారు.విధి నిర్వహణలో సూపర్వైజర్లు సమయపాలన పాటి ంచాలని, ఫీల్డ్ యందు డ్యూటీ సమయం ముగిసే వరకు ఉండాలని, సీని యర్ సూపర్వైజర్లు కూడా మెడికల్ అధికారి సూచనలు పాటించాలని కలె క్టర్ తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రం నందు అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక రూపొందించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఫీవర్ సర్వేలో ఎక్కువ జ్వరాలు నమోదైన గ్రామాలలో పంచాయతీ కార్యదర్శి సహకారంతో ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, వైరల్ జ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఎడిపిహెచ్ఓ డాక్టర్ అన్న ప్రసన్న, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## దళితులపై దాడి చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి



**రంగారెడ్డి,సెప్టెంబర్21(మనం న్యూస్) :** దళితులపై దాడి చేసిన వారిపై నాన్బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని తెలంగాణ మాల మహానాడు అధ్యక్షులు జి.చెన్నయ్య, తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బేర బాల కిషన్ (బాలన్న), మాల మహానాడు నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపగోని రమేష్ అన్నారు. సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని చెరుకు తోట కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం నుండి సరూర్ నగర్ చెరువులో నిమజ్జనానికి ఊరేగింపుగా బయలుదేరిన గణనాథుడని, అరబిందో కాలేజీ వద్ద జక్కిడి రఘు వీరారెడ్డి, ప్రతీక్, విజయ్ వారి అనుచరులతో కలిసి ఊరేగింపును ఆపి కులం పేరుతో దూషించి దళిత మహిళలను యువకులను అకారణంగా ఇష్టం వచ్చినట్లు కొట్టి కులం పేరుతో దూషించి చంపేస్తామని బెదిరించిన సంఘటనపై శనివారం జి. చెన్నయ్య, బేర బాలకిషన్, వెంకటేశ్వర్లు, రమేష్ కలిసి ఎల్బీ నగర్ ఏసిపి కృష్ణయ్యకు..., దాడికి పాల్పడిన వారిపై నాన్బె లబుల్ కేసులు నమోదు చేయాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు. బేలబుల్ కేసులు నమోదు చేసి నిందితులకు అనుకూలంగా కేసులు పెట్టినట్టు ఆషామాసిక వ్యవహరిస్తే చలో ఎల్బీనగర్ పిలుపుని ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రఘు వీరారెడ్డి అతని అనుచరుల చేతిలో దాడిలో గాయపడిన స్వరూప రాణితో పాటు అనేకమంది గాయపడ్డారని, స్వరూప రాణి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వెంటనే మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఖర్చులతో యశోద ఆసుపత్రిలో చికిత్స చేయించాలని చెన్నయ్య. బేర బాల కిషన్.(బాలన్న )బూర్గుల వెంకటేశ్వర్లు రమేష్ ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపి కృష్ణయ్య మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షిస్తామని న్యాయ సలహా లు తీసుకొని ఎంతటి వారైనా మాలలపై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు భీమ ముత్యాలు, ఆవుల రమేష్, యాదగిరి, రేఖల నర్సింగరావులతో పాటు బాధితులు పాల్గొన్నారు.

## ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ల సస్పెన్షన్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి):** కాల్వ శ్రీరాంపూర్ మండలం తారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్ధన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పి.సదానందం (ఇంగ్లీష్ ), అబ్దుల్ ఖాదరీ (బయో సైన్స్) అనే స్కూల్ అసిస్టెంట్ల ను 6వ తరగతి చదువుతున్న బాలికలతో తప్పుగా ప్రవర్తించిన కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా వర్ధంతి వేడుకలు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి) :** తెలంగాణ ఉద్యమ పితామహుడు కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్క పద్మశాలి బిడ్డ కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా పద్మశాలి సేవా సంఘం అడ్ హక్ కమిటీ అధ్యక్షులు వలస నీలయ్య పేర్కొన్నారు. శనివారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ సమీపంలో లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు కృషిచేసి తన మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసి రాష్ట్ర సాధనే లక్ష్యంగా పోరాడిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మన్ అన్నారు. పద్మశాలి కుల అభివృద్ధి కోసం హైదరాబాదులో రాజ్ మహల్ భవనం నిర్మాణం చేపట్టి పద్మశాలీల ఐక్యతే లక్ష్యంగా ముందుకు సాగిన వ్యక్తి పద్మశాలి ముద్దుబిడ్డ కావడం గర్వకారణం అని అన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా పద్మశాలీలు ముందుకు పయనించేలా సహాయ సహకారాలు అందించుకొని ముందుకు సాగుదాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రాంత ఉపాధ్యక్షులు ఆడెపు సుధాకర్, తెలంగాణ రాష్ట్ర చేనేత వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిపల్లి సదానందం, అడ్ హక్ కమిటీ సభ్యులు డివిఎస్ మూర్తి, పెగడ చందు, జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి రాజేష్, సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల అధ్యక్షులు చిప్ప భాస్కర్, గుండా మురళి, కామణి రాజేశం, కొండి సతీష్ కుమార్, మామిడి కనకరాజు, ఆడెపు శంకరయ్య, కొండబత్తుల మల్లేశం, ఆడెపు కనకయ్య, దిడ్డి సత్యనారాయణ, అడిచెర్ల లక్ష్మణ్, దిడ్డి రాజయ్య, బూర్ల ధనుంజయం, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్ళు పకడ్బందీగా నిర్వహించాలి



- ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :**వరి ధాన్యం కొనుగోళ్ళు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ (2024-25) ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో అదనపు కలెక్టర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సకల వసతులు కల్పించాలని, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, కామన్ రకానికి రూ.2300 నిర్ణయించిదని వెల్లడించారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202,ఐకేపీ ఆధ్వర్యంలో 44, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, మొత్తం 258 ప్రారంభించనున్నట్లు తెలిపారు.జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ వెల్లడించారు. టార్పాలిన్లు 7777, తూకం వేసే యంత్రాలు 766, ప్యాడీ క్లీనర్లు 634, తేమ శాతం చూసే మెషిన్లు 603 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీఎస్ఓ వసంత లక్ష్మి, జిల్లా మేనేజర్ రజిత డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, డీటీఓ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** విద్యార్థిని విద్యార్థులకు విద్యార్థి దశ నుండే వాహనాల చట్టాలపై, ట్రాఫిక్ నియమలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాస్ పేజ్ 2 అవగాహ కార్యక్రమాన్ని శనివారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని స్థానిక ఫంక్షన్ హాల్ లో విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై ట్రాఫిక్ రూల్స్,సిగ్నల్స్, సైన్ బోర్డ్స్, వాహనాల చట్టాలు,రోడ్ భద్రత నియమాల ఆవాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల చట్టాలపై, ట్రాఫిక్ నియమలపై, ట్రాఫిక్ సిగ్గత సంవత్సరం జిల్లాలో అని పాటశాలల్లో,కళాశాలలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్ పేరుతో అవగాహన కల్పించమని,రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్ పేజ్ -2 పేరుతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు.విద్యార్థిని విద్యార్థులకు వాహనాల చట్టాలు,రోడ్ భద్రత నియమాలపై అవగా హన కలిగి ఉంటే రానున్న రోజుల్లో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ ఉంటాయని, ట్రాఫిక్ నియమ నిబంధనలు విద్యార్థి దశ నుండే అలవర్చుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. అదే విదంగా విద్యార్థులు రోడ్డుపై జరిగే ప్రమాదాలను తల్లి దండ్రులకి, ప్రజలకు తెలియచేయాలని తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించే విధంగా నియమ నిబంధనలు పాటించే విధంగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సి.ఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు, ఎన్జీవో ఒర్సూ, పాటశాల సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.



# కేజిబీవీలో ఖాళీ పోస్టులకు ఆసక్తి గల మహిళా అధ్యాపకులు హాజరు కావాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్ధన్ రావు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి) :** జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతులు విధులు నిర్వహించేందుకు మహిళా అధ్యాపకులు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి సి.హెచ్.వి.ఎస్. జనార్ధన్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు మహిళా కాంట్రాక్టు అధ్యాపకులను నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని, పెద్దపల్లి జిల్లాలో (01) స్పెషల్ ఆఫీసర్, (13) సి ఆర్ టి (13) పీజీ సీ ఆర్ టి, పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు సెప్టెంబర్ 23 న స్పెషల్ ఆఫీసర్ పీజీ , సీ ఆర్ టి, పోస్టులకు, సెప్టెంబర్ 24న సి ఆర్ టి సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొరకు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికేట్లతో జిల్లా విద్యాశాఖాధికారి పెద్దపల్లి కార్యాలయములో హాజరు కావాలని, మెరిట్ లిస్టు ఇతర వివరముల కొరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పిఈడిడిఎపిఎల్ఎల్ఐడి ఈవో.సీఓఎం వెబ్ సైట్ ను సందర్శించగలరని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అవినీతి ఆరోపణల నేపథ్యంలో మంథని బిల్ కలెక్టర్ సస్పెన్షన్

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, సెప్టెంబర్ 21(మనం ప్రతినిధి) :** అవినీతి ఆరోపణ నేపథ్యంలో మంథని మున్సిపాల్టీలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రాజును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.మంథని పట్టణ నివాసి సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సెప్టెంబర్ 19, 2024 నాడు బిల్ కలెక్టర్ రాజు అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేస్తూ దరఖాస్తు సమర్పించారు. ఇంటి పన్ను 50 వేలు పెండింగ్ ఉన్న నేపథ్యంలో పునః పరిశీలించే అంశంలో బిల్ కలెక్టర్ ను ఫిబ్రవరి 2024 నెలలో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ సంప్రదించగా 25 వేల రూపాయలు చెల్లించాలని చెప్పారని, 14 వేల రూపాయల నగదు, ఫోన్ పే ద్వారా 11 వేలు చెల్లించిన తర్వాత ఇంటి పన్ను రసీదు కోరగా, 647 రూపాయలకు మాత్రమే ఇంటి పన్ను రసీదు అందించారని ఫిర్యాదులో సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ తెలిపారు. సయ్యద్ అఫ్రోజ్ హుస్సేన్ ఫిర్యాదు, అందుబాటులో ఉన్న ఆధారాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్ బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. సస్పెన్షన్ కాలంలో బిల్ కలెక్టర్ మంథని హెడ్ క్వార్టర్ అనుమతి లేకుండా వదిలి వెళ్ళవద్దని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# యథా రాజా తథా పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కార ణంగా అవినీతి మకిలి పడితే.. సీని యర్ పోలీస్ అధికారులు పడిన కష్ట మంతా వృథా అవుతుందని మాజీ మ ంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు పోలీసు అధికారుల కు సంబంధించి అవినీతి ఆరోపణల పై వచ్చిన కథనాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. యువ అఖిల భారత సర్వీస్ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి, వాళ్లకి పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభా వాన్ని నేర్పించాలన్నారు. కానీ 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి తయారైందని వ్యాఖ్యా నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలతో గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దామని, ఆ ప్రక్రి యలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల పాత్ర కచ్చితంగా ఉందన్నారు. అలాంటి తె లంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే పోలీస్ అధికారులు పడ్డ కష్టమంతా వృథా అవుతుందన్నారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి సూచించారు.

## కరాటేలో సెయింట్ జార్జ్ విద్యార్థి ప్రతిభ



**కొత్తపల్లి ,సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** ఈనెల 14 15వ తేదీల్లో కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ టు ఆల్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో సేయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్(సీబీఎస్ఈ) లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి ఎదుల్ల కృషిత్ అండర్ 14 బాలుర విభాగంలో గోల్ మెడల్ సాధించి గ్రాండ్ ఛాంపియన్షిప్ కు అర్హత సాధించి గ్రాండ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యద్భుతమైన పోరాటపటిమను కనబరిచి ప్రత్యర్థులను మట్టికరిపించి గ్రాండ్ ఛాంపియన్షిప్ ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి యొక్క తండ్రి గారైన ఎదుల్ల రాజశేఖర్ పెద్ద కుమారుడైన కృషిత్ తన యొక్క నిరంతర కృషితో దినదినాభివృద్ధి చెంది తన యొక్క ఫైటింగ్ స్కిల్స్‌ని ఇంకా అభివృద్ధి చేసుకోవాలని, ఇతను భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. గోజుర్యు కరాటే రాష్ట్ర చీఫ్ ఇన్స్ట్రక్టర్ సురభి వేణుగోపాల్‌ను అభినందించారు.

## ఆడపడుచులకు బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ




**మంచిర్యాల, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు జన్మదిన సందర్భంగా శ్రీ కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ కానుకగా ఆడపడుచులకు చీరలను పంపిణీ చేశారు. మంచిర్యాల నియోజకవరం లోని నస్పూర్ మున్సిపాలిటీ 3,4,5,6,7,9,16,17 వార్డులకు బతుకమ్మ పండుగ కానుకగా ఆడపడుచులకు చీరలను మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ,మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ లు పంపిణీ చేశారు. అనంతరం ప్రేమ్ సాగర్ రావు గారి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నాయకురాలు కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

## సదరం సర్టిఫికెట్ ఇచ్చి పెన్షన్ ఇవ్వడం మరిచారు



**వీణవంక, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలిపాక తిరుమలకు గత 2023 సంవత్సరం ఫిబ్రవరి నెలలో అంగ వైకల్యాన్ని గుర్తించి అధికారులు సదరం సర్టిఫికెట్ ఇచ్చారని ఇంత వరకు పెన్షన్ డబ్బు లు ఇవ్వలే దని ఆమె వాపోయారు. పేద కుటుం బానికి చెందిన తనకు కేవలం జీవనాధారం ఈ పెన్షన్ డబ్బులేనని అధికారులు మానవతావాదంతో పెన్షన్ డబ్బులు అందించి ఆదుకోవాలని కోరారు.

## తల్లిదండ్రులకు పాద పూజ



**మహాదేవపూర్,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** మహాదేవపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాద పూజ నిర్వహించి వారి పట్ల తమకున్న ప్రేమ ను చాటుకున్నారు. తల్లిదండ్రుల పాదాలు కడిగి పూలతో పూజ చేసి ఆ నీళ్లను తలపై చల్లుకొని వారి ఆశీస్సులు తీసుకున్నారు. తల్లి తండ్రులు పిల్లలపై పూలు అక్షింతలు వేసి వారిని ప్రేమగా దీవించారు. తల్లిదండ్రుల పట్ల పిల్లల్లో ప్రేమ అనుబంధాలు దెబ్బతింటున్న ఈ రోజుల్లోతల్లి దండ్రుల పట్ల ప్రేమ ఎన్నడు తగ్గదని మహాదేవపూర్ జిల్లా పరిషత్ విద్యార్థులు నిరూపించారని ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు బి రాజి రెడ్డి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి. తిరుపతి రెడ్డి, రాజయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీలత, లచ్చయ్య, అనిల్.సుదయ్య. సమ్మయ్య, షాజహా బేగం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలుగువర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించవద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రముఖ కవి, పరిశోధకుడు, ఉద్యమకారుడు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ స్పందించింది. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచన చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కోరారు. పొట్టి శ్రీరాములు ఏ ప్రాంతానికో, రాష్ట్రానికో చెందిన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ నాయకుడని అన్నారు. స్వాతంత్య్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొని మహాత్మాగాంధీ ప్రశంసలందుకున్నారని, ఆ మహనీయుడి జ్ఞాపకార్థం తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, కానీ, ఆయన్ని గౌరవించే క్రమంలో పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదన్నారు. ఏదైనా కొత్త ప్రాజెక్టుకు సురవరం పేరు పెట్టి.. ఆయన్ని గౌరవించాలని కోరారు.

మనం
Follow :
@Manamnews
సిద్దిపేట

# భవిష్యత్తు బీఆర్ఎస్‌దే

- కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత
- స్థానిక సంస్థలకు సిద్ధం కావాలి
- గులాబీ జెండా ఎగరాలి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్





**హుస్నాబాద్,సెప్టెంబర్ 21,(మనం న్యూస్):**భవిష్యత్తు బీఆర్ఎస్‌దే అని కార్యకర్తలెవరూ నిరుత్సాహపడవద్దు అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ అన్నారు. మండలంలోని పోతారం(ఎస్) గ్రామ శివారులోని శుభం గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృత కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి విధేయత కలిగి ఉన్న నాయకులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా అండగా ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని స్పష్టం చేసారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ నేటికి అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని మండిపడ్డారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కావాలని డిమాండ్ చేసారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం..రైతు రోధించిన రాజ్యం ఎప్పుడూ బాగుపడలేదని, రైతులను ఇబ్బంది పెడితే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులుండవు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, హన్మకొండ మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మాజీ ఎంపీపీలు కొక్కుల కీర్తి, లకావత్ మానస, కొత్త వినీత, మాజీ జడ్పీటీసీలు భూక్య మంగ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

## జర్నలిస్టులు సభ్యత్వం నమోదు చేసుకోవాలి




**భూపాలపల్లి,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు టి.యు.డబ్ల్యూ.జే (ఐజేయు) సభ్యత్వాన్ని తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, కార్యదర్శి సామంతుల శ్యామ్ తెలిపారు .జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం ఉదయం నుండి అందుబాటులో ఉన్న జర్నలిస్టులు సభ్యత్వం నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. అన్ని మండలాల్లో కూడా మండలానికి ఒక ఇన్ చార్జి ని నియమించి సభ్యత్వ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాలను ఇప్పించడం కోసం టి.యు.డబ్ల్యూ.జే (ఐ జే యు) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ,కార్యదర్శి రామ్ నారాయణ లు ఎంతో కృషి చేసి తెలంగాణ మీడియా అకాడమీ చేర్మేన్ .శ్రీనివాసరెడ్డి ద్వారా జర్నలిస్ట్ లకు అతి త్వరలో హైదరాబాదులో జరిగే జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా తీపి వార్తని అందించబోతున్నారని తెలిపారు.అంతేకాకుండా జర్నలిస్టులకు అక్రిడేషన్ తోపాటు పని చేసే హెల్త్ కార్డలను ఇవ్వబోతున్నారని తెలిపారు.దిగజారిన మీడియా విలువలను కాపాడటం కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసి ,జర్నలిజానికి పూర్వ వైభవం తీసుకురావడం కోసం టి.యు.డబ్ల్యూ.జే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గంతో పాటు మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.కావున అతి త్వరలో హైదరాబాదులో జరిగే జర్నలిస్ట్ ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా నుండి ఎక్కువ సంఖ్యలో జర్నలిస్టులు హాజరుకావాలని, నిరంతరం జర్నలిస్టుల సమస్యల కోసం పోరాడుతూ జర్నలిజానికి పూర్వ వైభవం తీసుకురాబోతున్న టీయూ డబ్ల్యూజే(ఐజేయు)లో జిల్లాలో పనిచేస్తున్న ఎక్కువ మంది జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోని యూనియన్ అభివృద్ధి కి సహకరించాలని జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కోరారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



**భూపాలపల్లి, సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లను రద్దు చేయాలని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను శనివారం బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దగ్దం చేశారు.జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్‌లో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పుల్యాల రాజు ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు భట్టు రవి,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నం యుగంధర్ లు మాట్లాడుతూ అమెరికా పర్యటనలో భారతదేశ కీర్తి ప్రతిష్టలను, భారతదేశ ప్రజలను అవమానించేలా రాహుల్ గాంధీ రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని, దేశంపై అక్కస్సుతో విషం చిమ్ముతున్నారని అన్నారు.రిజర్వేషన్ల రద్దుకు తెరలేపుతున్నారని, భారత వ్యతిరేక శక్తులు, వ్యక్తులతో రాహుల్ సమావేశం అవడం దుర్మార్గంమని, అప్పుడు నెహ్రూ తర్వాత ఇందిరా ఇప్పుడు రాహుల్ ఎస్సీ ఎస్టీ బీసీల సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకు తాను తన పార్టీ సిద్ధమని మరోసారి మైనార్టీ పక్షపాతాన్ని బహిరంగంగా ప్రకటించిన రాహుల్ గాంధీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యలు దేశ ప్రతిష్టను గాయపరిచాయని మండిపడ్డారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడం ద్వారా కాంగ్రెస్ రిజర్వేషన్ వ్యతిరేక వైఖరి బయటపడిందని అన్నారు బిజెపి ఉన్నంతవరకు రిజర్వేషన్లను రద్దు చేయడం గాని దేశభద్రతతో ఎవరైనా చెలగాటమాడటాన్ని అనుమతించదని అన్నారు. రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్ ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ ది అని అన్నారు. హక్కుల కోసం రాహుల్ గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ వెంటనే యావత్తు దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సభ్యత్వ సహ ప్రముక్ దొంగల రాజేందర్,ఓబిసి మోర్చా జిల్లా నాయకుడు మాచనవేణి రవీందర్, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

## పోషణ మాసం కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేయాలి




- కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** పోషణ మాసం కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.శనివారం ఐడిఓసి కార్యాలయపు సమావేశపు హాలులో సిడిపివోలు, అంగన్వాడి సూపర్ వైజర్లు, హెల్త్ సబ్ సెంటర్ల వైద్యులు, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యాశాఖ అధికారులతో పోషణ మాస కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలు, బాలింతలు గర్భిణీ స్త్రీలలో పౌష్టికార లోపం తలెత్తకుండా ఉండేందుకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1 నుండి 30వ తేదీ వరకు పోషణ మాస కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోషణ మాసం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అన్ని గ్రామాలలో అమలు చేయాలని సరైన పౌష్టికాహారం అందించినప్పుడు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వ్యాధుల బారిన పడకుండా ఉంటారని తెలిపారు.గ్రామాలలో ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు గ్రామాల్లో ప్రతి ఇల్లును పరిశీలించి పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలని తెలిపారు. వయసుకు తగ్గ బరువు ఎత్తు కొలతను నిర్వహించి పౌష్టికాహార లోపాలు ఉంటే నాణ్యమైన పౌష్టికాహార అందించాలని తెలిపారు. సరైన బరువు లేకపోవడం, రక్తహీనత, ఇతర వైద్య పరమైన సమస్య ఎదుర్కొంటున్న పిల్లలను ,గర్భిణీ స్త్రీలను బాలింతలను, ఆయా మండలాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్స అందించాలని అన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులను, గర్భిణీలను, బాలింతల సంబంధించిన నివేదికను అందించాలని తెలిపారు.పాఠశాలలో మధ్యాన్న భోజనం ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పాఠశాలలో రక్తహీనత, వైద్య పరమైన సమస్యలున్న విద్యార్థులను గుర్తించి వైద్యులకు సమాచారం అందించి వైద్య సేవలు అందించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. చిన్నపిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు సరైన సమయంలో టీకాలు వేయాలని ఐరన్, పోలిక్ యాసిడ్, పౌష్టికాహారం లోపాల వల్ల తలెత్తే సమస్యల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వైద్య అధికారులను ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో ఎన్సిపి ఆర్ మెంబర్ శోభారాణి మాట్లాడుతూ జిల్లాలో పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి మెరుగైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.బాధ్యత యుతంగా వ్యవహరించి వాస్తవ నివేదికలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, ఇతర శాఖల జిల్లా అధికారులు, సిడిపివోలు, సబ్ సెంటర్ల వైద్యులు, అంగన్వాడి సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేంద్ర మంత్రి రాక



**మహాదేవపూర్,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు. కరీంనగర్ ఎం పి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సజయ్ కుమార్ ఆదివారం మహాదేవపూర్ రానున్నట్లు బిజెపి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి తెలిపారు. గత కొద్ది రోజులక్రితం మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకుడు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి మంతన రాజేందర్ పార్టీ సభ్యత్వాలు సేకరిస్తున్న సమయంలో గుండె పోటు తో కుప్పకూలీ హఠాత్ మరణం చెందాడు. నాయకని మరణం తెలుసుకున్న బండి సంజయ్ కుమార్ పార్టీ కార్యక్రమాల్లో కేరళలో ఉన్నందున రాలేక పోయానని రాజేందర్ కుటుంబాన్ని ఆదివారం ఓదార్చేందుకు రానున్నట్లు సునీల్ రెడ్డి తెలిపారు.

## భూసేకరణ వేగవంతం చేయాలి



**భూపాలపల్లి,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కన్వేయర్ కెటిపిపి పరిశ్రమకు బొగ్గు రవాణాకు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు భూసేకరణ, దుబ్బపల్లి గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, కేటిపీపీ భూముల సరిహద్దులు ఏర్పాటు, తాడిచర్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై జెన్కో, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ తాడిచర్ల నుంచి ఘనపురం మండలంలోని చెల్పూరులోని కేటిపీపీకి కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు 17 కిలోమీటర్లకు 133 ఎకరాల భూమి సేకరణ చేయాల్సి ఉండగా సుమారు 14 కిలోమీటర్లు భూసేకరణ జరిగిందని తెలిపారు. భూ నిర్వాసితులకు పరిహారం అందించామని మిగిలిన 3.5 కిలోమీటర్ల వరకు భూసేకరణను వేగవంతం చేసేందుకు సి పల్లి, కొంపల్లి గ్రామాల మీదుగా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున నిర్వాసితులతో మాట్లాడి భూసేకరణ జరపాలని తెలిపారు.కాకతీయ లాంగ్ వాల్ ప్రాజెక్ట్ నుండి కెటిపిపి వరకు ఏర్పాటు చేయబోయే మరొక కన్వేయర్ బెల్ట్ కోసం సేకరించిన భూమి ఆక్రమణ కాకుండా సర్వే నిర్వహించి భూములకు సరిహద్దులను ఏర్పాటు చేయాలని అన్నారు. బ్యాలెన్స్ అసైండ్ భూములకు ఎంజాయ్మెంట్ సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.కెటిపిపి నిర్మాణంలో భూములు కోల్పోయిన దుబ్బపల్లి గ్రామాన్ని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తాడిచర్ల భూ నిర్వాసితులకు ఇంటి స్థలాలు అందించడానికి చర్యలు చేపట్టాలని, కాపురం గ్రామం వద్ద అబాది-భూమి 6.31 ఎకరాలు కోసం అవార్డు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవో మంగీలాల్, కేటిపిపి సిఈ సిద్దయ్య, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యను అందించాలి



**భూపాలపల్లి,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** వైద్య కళాశాలలో మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా అటానమి, మ్యూజియం, మొదటి, రెండవ సంవత్సరం లెక్చరర్స్ గ్యాలరి, హెచ్ ఆర్ రూమ్ లను పరిశీలించి వైద్య కళాశాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ఉపాధ్యాయులు రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం రామప్ప కాలనీలో సింగరేణి అధికారులతో మాట్లాది రెండు బ్లాకులను కేటాయించాలని, జిల్లా ఆసుపత్రి నుండి మెడికల్ కళాశాలకు ప్రయాణించడానికి రెండు బస్సులను ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాల ఆవరణలో రెండు బోర్ వెల్స్ ఏర్పాటు చేయాలని, సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలని, వైద్య కళాశాలలో పొరుగుసేవల సిబ్బంది నియామకం కోసం అనుమతి ఇవ్వాలని కోరగాజిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సింగరేణి అధికారులతో మాట్లాడి 100 మంది విద్యార్థులకు వసతి ఉండే విధంగా మూడు బ్లాకులను కేటాయిస్తామని తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులకు విద్య బోధన కోసం సెకండ్ లెక్చరర్ హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామన్నారు. మెడికల్ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ వైద్య కళాశాల అధ్యాపకులను ఆదేశించారు.అనంతరం నర్సింగ్ కళాశాల ఏర్పాటు కోసం నూతనంగా నిర్మిస్తున్న ఆయుష్ భవనాన్ని పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మెడికల్ కళాశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శశికాంత, డాక్టర్ వందన ,డాక్టర్ రాజేశం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి



**టేకుమట్ల,సెప్టెంబర్ 21(మనం న్యూస్) :** ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయంగా ఎదిగిన కాంగ్రెస్ పార్టీ మహా నాయకుడు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ కారుడు, కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మండలంలో చేనేత సహకార సంఘాల నాయకులు,చేనేత కార్మికులు, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం చేనేత కార్మికులకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు ఇవ్వడం ద్వారా చేనేత కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఐఐహెచ్ టి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్మ టెక్నాలజీ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును ప్రతిపాధించి పద్మశాలి ల పట్ల తన అంకిత భావాన్ని చాటాడు అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి యావత్ పద్మశాలి సమాజం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పద్మశాలి మండల అధ్యక్షుడు వంగ నరేష్ మండల పద్మశాలి నాయకులు దూడం రాములు,పోలు రమేష్, మాచర్ల రాజేష్, మచ్చగిరి సారయ్య,మాచర్ల రాజమౌళి, పెంట రంజిత్ ,పెంట రమేష్ ,పెంట వేణు, కోమాకుల హనుమంతు, పల్లెవెన సంపత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ




**మహాదేవపూర్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** ప్రజాస్వామ్యం లో ఓటుకు ఎంతో విలువ ఉంటుందని ప్రతి ఒక్కరూ ఓటు తమ హక్కుగా వినియోగించు కోవాలని గ్రీన్ వుడ్ పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం గ్రీన్ వుడ్ పాఠశాలలో పీపుల్ లీడర్, ఆశిస్టెంట్ పీపుల్ లీడర్ తో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు.మాక్ పోలింగ్ లో700మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓట్లు వేయడం. లెక్కింపు ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు జారిచేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటుకు ఎంతో విలువ ఉంటుందని ప్రతి పౌరుడు నీతి నిజాయితీ గా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఓటు ను సద్వినియోగం చేసుకున్నపుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తు లో రాజకీయాల్లో రాణించి మంచి పదవులు పొంది దేశాభివృద్ధికి పాటుపడేలా మంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా మాక్ పోలింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.మాక్ పోలింగ్ సందర్భంగా పాఠశాల ఎన్నికల వాతావరణం తలపించింది. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులను అందజేశారు. అనంతరం విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు



**మహాదేవపూర్,సెప్టెంబర్ 21 (మనం న్యూస్) :** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణా ఉద్యమ నాయకుల్లో పోరాడిన వారిలో ప్రముఖుడైనా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్ లో మహాదేవపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మంచినీళ్ల దుర్గయ్య, జిల్లా యూత్ నాయకుడు పరుశవేణి నగేష్, మండల నాయకుడు శేఖర్ రెడ్డి, జిల్లా ఎన్ ఎస్ యు ఐ సెక్రెటరీ మంచినీళ్ల హరీష్ పాల్గొన్నారు.

# అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ ప్రధాని భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం అమెరికా చేరుకున్నారు. ఫిలడెల్ఫియాలోని అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయనకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. భారతీయ అభిమానులు పెద్ద సంఖ్యలో ఫిలడెల్ఫియా అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలివచ్చారు. మోదీతో సెల్ఫీ దిగేందుకు ఉత్సాహాన్ని కనబరిచారు. మూడు రోజుల పర్యటనలో మోదీ విల్మింగ్టన్‌లో క్వాడ్ సదస్సులో బైడెన్‌తో సమావేశమవుతారు. క్వాడ్ దేశాధినేతలను కలుసుకుంటారు. రెండో రోజున న్యూయార్క్ వెళ్లి పలువురు ప్రముఖ వ్యాపార, వాణిజ్యవేత్తలను కలుసుకుంటారు. అదే రోజున ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈనెల 23న ఐరాస జనరల్ అసెంబ్లీలో జరిగే సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్‌పై ప్రధాని ప్రసంగిస్తారు. మూడు రోజుల పర్యటనకు గానూ ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా బయల్దేరి వెళ్లారు. అమెరికాలో ఆయన మొదట క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌లో పాల్గొంటారు. ఆ తరువాత అక్కడి భారతీయులను కలుస్తారు. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల హడావుడి కొనసాగుతున్న సమయంలో ప్రధాని మోదీ అక్కడ పర్యటిస్తుండడం విశేషం. మూడు రోజుల అమెరికా పర్యటన కోసం ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఉదయం బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో మోదీ క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌లో పాల్గొంటారు, ఐక్యరాజ్యసమితిలో చర్చల్లో పాల్గొంటారు. పలు ఉన్నత స్థాయి సమావేశాల్లో పాల్గొంటారు.

### క్వాడ్ లీడర్స్ సమ్మిట్

అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 6వ క్వాడ్ లీడర్స్ సమ్మిట్, ఐక్యరాజ్యసమితి 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'లో పాల్గొని ప్రసంగిస్తారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్వస్థలం డెలావేర్‌లోని విల్మింగ్టన్‌లో క్వాడ్ లీడర్స్ సమ్మిట్ జరుగుతోంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని దేశాల అభివృద్ధి లక్ష్యాలు, ఆకాంక్షలను చేరుకోవడంలో సహాయపడటానికి ఈ శిఖరాగ్ర సమావేశంలోని నాయకులు గత ఏడాది పురోగతిని సమీక్షిస్తారని, రాబోయే సంవత్సరానికి ఎజెండాను నిర్ణయిస్తారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. శిఖరాగ్ర సమావేశం అనంతరం అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

### ప్రధాని మోదీ ఎజెండాలో ఏముంది?

ఆదివారం (సెప్టెంబర్ 22)నాడు లాంగ్ ఐలాండ్‌లోని ప్రవాస భారతీయులతో సంభాషించడానికి మోదీ న్యూయార్క్ వెళ్లనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్స్, బయోటెక్నాలజీ వంటి అత్యాధునిక రంగాల్లో ఇరు దేశాల మధ్య మరింత సహకారాన్ని పెంపొందించడానికి అమెరికాకు చెందిన ప్రముఖ కంపెనీల సీఈవోలతో ఆయన భేటీ అవుతారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా పర్యటన చివరి రోజున న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'లో ప్రధాని ప్రసంగిస్తారు. 'మెరుగైన రేపటి కోసం బహుళపక్ష పరిష్కారాలు' అనేది ఈ సదస్సు థీమ్.

### క్వాడ్ లీడర్స్ సమ్మిట్‌లో చర్చించే కీలక అంశాలు

క్వాడ్ కూటమిలో నాలుగు దేశాలున్నాయి. అవి భారతదేశం, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా. ప్రపంచ శ్రేయస్సు కోసం ఒక శక్తిగా పనిచేయడానికి మరియు బహిరంగ, స్వేచ్ఛాయుత, సమ్మిళిత, సంపన్న ఇండో-పసిఫిక్ ను రూపొందించడానికి ఈ క్వాడ్ కూటమి ఏర్పడింది. ఈ 6వ క్వాడ్ శిఖరాగ్ర సమావేశంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ఇండో-పసిఫిక్‌లో పరిస్థితులు వంటి అంతర్జాతీయ సవాళ్లపై నేతలు చర్చించనున్నారు. ఇండో-పసిఫిక్ అభివృద్ధి ప్రాధాన్యాలపై భాగస్వాముల కృషి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అమలు, ప్రజావసరాల పంపిణీ వంటి నిర్మాణాత్మక ఎజెండాను ఈ సదస్సు కలిగి ఉంటుంది.

### కేన్సర్ నివారణకు..

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కేన్సర్‌ను నివారించడానికి, గుర్తించడానికి, చికిత్స చేయడానికి ప్రత్యేక చొరవ అయిన కేన్సర్ మూన్ షాట్‌ను కూడా క్వాడ్ నాయకులు ప్రారంభించనున్నారు. వీటితో పాటు పెట్టుబడులు, సామర్థ్యం పెంపు సహా పలు రంగాల్లో కొత్త కార్యక్రమాలు, కట్టుబాట్లపై నలుగురు నేతలు చర్చించనున్నారు. మోదీ, బైడెన్ మధ్య జరిగే ద్వైపాక్షిక సమావేశంలో ఇరువురు నేతలు ఇరు దేశాల మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షిస్తారు. ఇండో-పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ప్రాస్పెరిటీలోని నాలుగు స్తంభాల్లో రెండింటిలో భారత్ చేరడంపై ఒప్పందాలు, భారత్-అమెరికా డ్రగ్ ఫ్రేమ్ వర్క్‌పై అవగాహన ఒప్పందంను ఇరు పక్షాలు ఆవిష్కరించే అవకాశం ఉంది.

## శ్వేతసౌధంలో ఖలీస్థానీ మద్దతుదారులు

### అమెరికా జాతీయ భద్రతామండలి ఆధ్వర్యంలో భేటీ

**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** మోదీ అమెరికాలో అడుగుపెట్టే కొన్ని గంటల ముందే కీలక పరిణామం జరిగింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఖలీస్థానీ మద్దతుదారులు, సిక్కు వేర్పాటువాద నాయకులతో కీలక సమావేశం జరిపింది. అమెరికా జాతీయ భద్రతామండలి ఆధ్వర్యంలో తొలిసారి జరిగిన ఈ సమావేశానికి అమెరికన్ సిఖ్ కాకస్ కమిటీ వ్యవస్థాపకుడు ప్రీత్‌పాల్ సింగ్‌తో పాటు సిఖ్ అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ సభ్యులు, పలు సిక్కు సంఘాల నేతలు హాజరయ్యారు. అమెరికా పౌరుల రక్షణకు భరోసానిచ్చింది. అదే సమయంలో అమెరికా గడ్డపై ఇతర దేశాలు తమ పౌరులను లక్ష్యంగా చేసుకోనీయబోమని శ్వేత సౌధం స్పష్టం చేసింది. సమావేశం తర్వాత ప్రీత్‌పాల్ సింగ్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికా సిక్కులకు మరింత రక్షణ కల్పించాలని కోరామన్నారు. ఖలీస్థానీ వేర్పాటువాదులకు అమెరికా, కెనడా ఆశ్రయం కల్పిస్తున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో స్వయంగా అధ్యక్ష భవనం సాక్షిగా జరిగిన పరిణామాలు కలకలం రేపుతున్నాయి. కాగా, ఖలీస్థానీ ఉగ్రవాది పన్నూ హత్యాయత్నం కేసులో అమెరికా జిల్లా కోర్ట్ భారత ప్రభుత్వానికి, దోభాల్‌కు సమన్లు జారీ చేసిన రోజుల వ్యవధిలోనే వైట్‌హౌస్‌లో ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## అమూల్ కల్తీ నెయ్యి అంటూ.. దుష్ప్రచారం

### సోషల్ మీడియా ప్రచారంపై అమూల్ ఖండన

### అహ్మదాబాద్‌లో క్రిమినల్ కేసు నమోదు

**అహ్మదాబాద్, సెప్టెంబర్ 21 :** తిరుమల శ్రీవారి మహాప్రసాదమైన లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో అపవిత్ర పదార్థాలు కలిపారన్న ప్రచారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్న వేళ.. ఈ వ్యవహారంలోకి అమూల్ కంపెనీ ప్రవేశించింది. తిరుపతి ఆలయానికి అమూల్.. జంతువుల కొవ్వుతో కలిపిన నెయ్యిని సరఫరా చేసిందని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో నెటిజన్లు ఆరోపణలు గుప్పించారు. వీటిని సీరియస్‌గా తీసుకున్న అమూల్ కంపెనీ యాజమాన్యం శనివారం పలువురిపై కేసు నమోదు చేసింది. తిరుపతిలో ఉపయోగించే నెయ్యి కల్తీ అని తేలింది. కొందరు వ్యక్తులు ఆ నెయ్యిని అమూల్ సరఫరా చేసిందని వదంతులు సృష్టిస్తున్నారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశాం. మా కంపెనీతో 36 లక్షల కుటుంబాలు అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. వారిని మా నుంచి వేరు చేసేందుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. మా ఉత్పత్తులు అత్యుత్తమ నాణ్యతను కలిగి ఉంటాయి. నాణ్యత విషయంలో మేమెక్కడా తగ్గం. మాపై జరుగుతున్న దుష్ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరుతున్నాం. ఇప్పటివరకు టీటీడీకి మేం ఏ ఆహార పదార్థం సరఫరా చేయలేదని అమూల్ మాతృ సంస్థ, గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మేనేజింగ్ డైరెక్టర్ జయేన్ మెహతా అన్నారు. వ్యతిరేకప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం వెళ్తామని ఆయన వెల్లడించారు.

## బర్కత్‌పుర పీఎఫ్ ఆఫీసుకు కేంద్ర మంత్రి



**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో ఉన్న పీఎఫ్ కార్యాలయాన్ని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ శనివారం సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈపీఎఫ్ తెలంగాణ జోన్లో ఏటా రూ.7,797కోట్ల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. యువ ఉద్యోగుల కోసం కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్లో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్(ఈఎల్ఐ) పథకాన్ని ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ పథకం కింద.. మొదటిసారి ఉద్యోగంలో చేరే యువతీయువకులకు ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తుందన్నారు. కాగా, రిటైర్డ్ పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని భవిష్యనిధి పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు నాగేందర్ తదితరులు ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు.

## నా వ్యాఖ్యలపై దుష్ప్రచారం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 :** అమెరికా పర్యటనలో సిక్కులను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. అమెరికాలో తాను చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ అబద్ధాలు ప్రచారం చేస్తుందని, తన నోరు మూయించాలని అనుకుంటోందని శనివారం ఎక్స్ పోస్టులో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతి సిక్కు, ప్రతి భారతీయుడూ.. నిర్భయంగా తన మతాన్ని ఆచరించే దేశం భారత్ కాకూడదా? నిజం వైపు నిలబడ లేని బీజేపీ.. నా నోరు మూయించాలని అనుకుంటోంది. అమెరికాలో నేను చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దేశ, విదేశాల్లోని సిక్కు సోదర, సోదరీమణులను నేను ఒక్కటే అడగాలనుకుంటున్నా. నేను చేసిన వ్యాఖ్యల్లో ఏమైనా తప్పు ఉందా?' అని రాహుల్ గాంధీ తన పోస్టులో అడిగారు. మరోవైపు, రాహుల్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పలు సిక్కు సంఘాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. కాగా, రాహుల్‌గాంధీపై కర్ణాటక బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. విదేశాలలో భారత్ పరువును మంటగలిపేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని, ప్రధాని మోదీ పట్ల అనుచితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే అంశంపై బీజాపూర్, బెళగావి, బాగల్కోటెలలోనూ రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మరో 6 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలు

### కొత్త ఛైర్మన్, సభ్యులకు మంత్రి తుమ్మల శుభాకాంక్షలు

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్) :** రాష్ట్రంలో మరో 6 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం నూతన పాలకవర్గాలను నియమించింది. ఈమేరకు వ్యవసాయ శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత కమిటీలతో కలిపి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 70 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. నూతనంగా నియమితులైన పాలకవర్గాల ఛైర్మన్లు, సభ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. మిగిలిన కమిటీలను త్వరలోనే నియమిస్తామన్నారు. కాగా నూతనంగా నియమితులైన గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.



## సీఎం పీఠంపై ఆతిశీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠంపై ఆతిశీ ఆసీనులయ్యారు. శనివారం, ఇక్కడ రాజ్నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్జీ వినయ్‌కుమార్ సక్సేనా అతిశీతో ప్రమాణం చేయించారు. ఆమెతో పాటు క్యాబినెట్ మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, కైలాశ్ గెహ్లోత్, ఇమ్రాన్ హుస్సేన్, ముకేశ్ అహ్లావత్ ప్రమాణం చేశారు. మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఆప్ నేతల కుటుంబసభ్యులు ఆతిశీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. కార్యక్రమ అనంతరం కేజ్రీవాల్‌కు ఆతిశీ పాదాభివందనం చేశారు. ఆతిశీ సీఎంగా ప్రమాణం చేయడంతో ఢిల్లీలో వరుసగా నాలుగోసారి ఆప్ ప్రభుత్వం ఏర్పడినట్లయింది. మంత్రులకు శాఖలను కూడా ఆతిశీ కేటాయించారు. ఆమె తన వద్ద 13 శాఖలను అట్టిపెట్టుకున్నారు. రెవెన్యూ, ఆర్థికం, విద్య తదితర ముఖ్యమైన శాఖలు ఆమె పరిధిలోనే ఉన్నాయి. సౌరభ్ భరద్వాజ్‌కు 8 శాఖలు, గోపాల్ రాయ్‌కు 3 శాఖలు, కైలాశ్ గెహ్లోత్కు 5శాఖలు, ఇమ్రాన్ హుస్సేన్‌కు 2 శాఖలు, ముఖేశ్ అహ్లావత్‌కు 5 శాఖలను ఆమె కేటాయించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఆమె కొద్దికాలమే సీఎం పదవిలో ఉంటారు. ఢిల్లీ సీఎం పదవి చేపట్టిన ఎనిమిదో వ్యక్తి ఆతిశీ. ఆమె వయసు 42 ఏళ్లు. ఢిల్లీ సీఎం పీఠాన్ని అధిష్టించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు. దేశంలో 17వ మహిళా ముఖ్యమంత్రిగా, ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా రికార్డుల్లోకి ఎక్కారు.

### కేజ్రీవాల్ ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చారు

గత పదేళ్లలో ఢిల్లీ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్‌ది అని ముఖ్యమంత్రి ఆతిశీ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి బాధను కేజ్రీవాల్ అర్థం చేసుకున్నారని, ప్రజలకు ఉచిత వైద్యం అందించడం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల జీవితాలను మెరుగుపర్చడానికి కేజ్రీవాల్ కృషి చేశారని పేర్కొన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఆమె మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సీఎంగా అవకాశమిచ్చినందుకు కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేజ్రీవాల్కు వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను సఫలం కానివ్వబోమని తెలిపారు. సీఎం పదవిలో కొనసాగకుండా ఆ పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయడం తనను బాధిస్తోందని తెలిపారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కేజ్రీవాల్‌ను సీఎంగా గెలిపించాలని ఢిల్లీ ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. బీజేపీ గెలిస్తే కుట్ర చేసి ఉచిత విద్యుత్తును నిలిపివేస్తుందని హెచ్చరించారు.

## కాశ్మీర్‌లో మూడు కుటుంబాల పెత్తనం

### వారికి బుద్ధి చెప్పాల్సిన సమయమిదే

### ఎన్నికల ప్రచారంలో అమిత్ షా పిలుపు



**శ్రీనగర్, సెప్టెంబర్ 21 :** జమ్మూలో మూడు కుటుంబాలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం హింసను ప్రేరేపించాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. కాబట్టి ఆ మూడు పార్టీల కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని మెంధార్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా అనే మూడు కుటుంబాల పాలనను అంతం చేయబోతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. ఈ మూడు కుటుంబాలే ఎన్నోఏళ్లుగా జమ్మూలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే, జమ్మూకశ్మీర్‌లో ఎప్పటికీ పంచాయతీ లేదా బ్లాక్ స్థాయి ఎన్నికలు జరిగేవి కావని అన్నారు. 1990ల్లో ల్లో ఇక్కడి సోదరులు ధైర్యసాహసాలతో బులలెట్లను ఎదుర్కొన్నారు. 1947 నుంచి పాకిస్థాన్‌తో జరుగుతున్న ప్రతీ యుద్ధంలో సైనికులు జమ్మూ సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని రక్షిస్తున్నారని అమిత్‌షా సైనికుల త్యాగాలను కీర్తించారు. కేంద్రప్రభుత్వం ఇప్పుడు కశ్మీర్ యువత చేతుల నుంచి తుపాకులు, రాళ్లను తీసేసి, పెన్నులు, ల్యాప్‌టాప్‌లు పట్టుకునేలా చేస్తోందని ప్రశంసించారు. త్వరలో ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం సరిహద్దుల్లో మరిన్ని బంకర్లను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇక్కడి పాలకులు పాకిస్థాన్‌ను చూసి భయపడేవారు. కానీ ఇప్పుడు మోదీని చూసి పాకిస్థాన్ భయపడుతోంది. భారత్ పైకి వస్తే ప్రధాని తగిన సమాధానం ఇస్తారని వారికి తెలుసు. అందుకే దేశ సరిహద్దుల్లో కాల్పులు తగ్గుముఖం పట్టాయని షా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ నిర్వహించగా.. రెండో దశ సెప్టెంబరు 25న, చివరిదశ అక్టోబర్ 1న జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న వెల్లడిస్తారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ తొలివిడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదవడంపై హర్షం వ్యక్తంచేశారు. 'ఇప్పుడు జమ్మూకశ్మీర్ యువత నిస్సహాయులు కారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పుడు కశ్మీర్ యువత రాళ్లను వదిలి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అంతేకాదు. ఇక్కడి ప్రజలు ఎలాంటి భయం, బెరుకు లేకుండా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. రెండో విడతలోనూ మరింత ఎక్కువమంది ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొని సరికొత్త రికార్డులు సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు.

## నాణ్యమైన నెయ్యి అందిస్తాం : విజయ డెయిరీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మనం న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ తెలిపింది. ఈ మేరకు టీటీడీ ఈవో జె.శ్యామలరావుకు లేఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచిఘోష్ తెలిపారు. దేశవ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ ప్రసిద్ధి చెందింది. వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులు సరఫరా చేసిన చరిత్ర ఉంది. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యత నిర్ధరించడంతో పాటు లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతోంది. టీటీడీకు అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి మా సంస్థ సన్నద్ధతలను తెలియజేస్తున్నాం. విజయ డెయిరీ ప్రభుత్వ సంస్థ అయినందున సరఫరాలో స్వచ్ఛత, నాణ్యత, ధరల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉంటుంది. దేవస్థానం, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. విజయ డైరీ ఉత్పత్తులలో నాణ్యతను నిర్ధారించడంతో పాటు, లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతుందని తెలిపారు. తిరుమల దేవస్థానానికి అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి విజయ డైరీ సంస్థ సన్నద్ధతను తెలియజే శారు. విజయ డైరీ ప్రభుత్వ సంస్థ అయినందున సరఫరాల స్వచ్ఛత, నాణ్యత, ధరల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు.

## నారీ శక్తికి తిరుగులేదు

**హైదరాబాద్, సెప్టెంబరు 21 (మనం న్యూస్):** దేశ సామాజిక, ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. నారీ శక్తికి తిరుగులేదని, మహిళలు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని పేర్కొన్నారు. ఏబీఆర్ఎస్ఎం(అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్), ఐసీఎస్ఎస్ఆర్ (భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి) ఆధ్వర్యంలో ఓయూ ఆడిటోరియంలో శనివారం జరిగిన 'అఖిల భారత మహిళా అధ్యాపకుల సదస్సు – నూతన భారత దర్శనం' అనే కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. అలాగే, డాక్టర్ వంగిపురం శ్రీనాథాచారి రచించిన 'జననం నీవే, జనని నీవే' అనే గీతాన్ని ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య, పరిశోధన రంగాల్లో మహిళలకు నాయకత్వ అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సుధా నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రతీ స్త్రీ విజయం వెనుక పురుషుల సహకారం ఉం టుందన్నారు. వృత్తి ఎంత ముఖ్యమో కుటుంబం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. సమాజంలో మహిళల పాత్రపై కీలకోపన్యాసం చేశారు. ఇక, జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షురాలు స్మృతి విజయ భారతి సయాని మాట్లాడుతూ.. కోల్‌కతా ఆర్జీకర్ ఆస్పత్రి ఘటనను ప్రస్తావించారు. దేశంలో ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా మహిళలపై ఆగడాలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక, జేఎన్యూ వీసీ ప్రొఫెసర్ శాంతిశ్రీ పండిట్ మాట్లాడుతూ.. మహిళలు తమకున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, దేశం నలుమూలల నుంచి ఈ సదస్సుకు హాజరైన 1600 మంది ప్రతినిధులకు మహిళా సాధికారత, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ఎస్ఎం అఖి ల భారత సంచాలకులు గుంతా లక్ష్మణ్ జీ, డాక్టర్ మంచుకొండ శైలజ తదితరులు పాల్గొన్నారు. కాగా, భారత్ సేవాశ్రమ్ సంఘ్, హైదరాబాద్ విభాగం సహకారంతో సోమాజిగూడలోని రాజ్‌భవన్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం నోటు పుస్తకాలు పంపిణీ చే శారు.



మనం

Follow : @Manamnews



## ఫ్రాంచైజీ మనసులో ఏముందో తెలిసింది.. అందుకే ఢిల్లీని వీడాను



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో సుదీర్ఘ అనుబంధం ఉన్న రికీ పాంటింగ్ మళ్లీ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఏడు సీజన్లలో ఒక్కసారి కూడా ఢిల్లీ క్యాపిటల్స్‌ను చాంపియన్‌గా నిలపలేకపోయిన ఆసీస్ లెజెండ్ ఈసారి పంజాబ్ కింగ్స్ కోచ్ అయ్యాడు. 17వ సీజన్ తర్వాత పాంటింగ్‌పై వేటు పడడానికి ఢిల్లీ చెత్త ప్రదర్శనే కారణమని అనుకున్నారంతా. అయితే.. అసలు విషయం వేరే ఉందని పాంటింగ్ అన్నాడు. అందుకనే తాను ఢిల్లీని వీడాల్సి వచ్చిందిన అతడు వెల్లడించాడు. 'ఢిల్లీ నన్ను పూర్తి స్థాయిలో హెడ్‌కోచ్‌గా ఉండాలని కోరింది. అందుకు నేను సిద్ధగా లేనని యాజమాన్యంతో చెప్పాను. అయితే.. చివరకు ఢిల్లీ నన్ను వదిలేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఫ్రాంచైజీ ఏం అనుకుంటుందో నాకు తెలిసిపోయింది. అందుకనే నేను ఢిల్లీ హెడ్‌కోచ్‌గా వైదొలిగాను' అని పాంటింగ్ తెలిపాడు. ఆస్ట్రేలియాకు మూడు వరల్ కప్లు అందించిన పాంటింగ్.. ఐపీఎల్లో మాత్రం ఫెయిలయ్యాడు. ఏడు సీజన్లలో అతడి దిశా నిర్దేశనంలో ఢిల్లీ ఓసారి ఫైనల్ చేర్చినా కప్పు ఒడిసిపట్టుకోలేకపోయింది. దాంతో, ఇంకా అతడిని కొనసాగించి లాభం లేదనుకున్న ఫ్రాంచైజీ ఇక మీ సేవలు చాలని పాంటింగ్‌కు చెప్పేసింది. ఐపీఎల్లో కోచ్‌గా సుదీర్ఘ అనుభవం ఉన్న ఆసీస్ లెజెండ్‌ను పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ కొత్త కోచ్‌గా నియమించింది. ఇక.. పాంటింగ్ పంజాబ్ ఐపీఎల్ ట్రోఫీ కలను నిజం చేసే పనిలో నిమగ్నం కానున్నాడు. కొత్త ఫ్రాంచైజీకి కోచ్‌గా వెళ్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందంటున్నాడు పాంటింగ్. 'నన్ను కొత్త హెడ్‌కోచ్‌గా తీసుకున్న పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి కృతజ్ఞతలు. ఈ కొత్త సవాల్ను స్వీకరించేందుకు నేను ఎంతో ఉత్సాహంతో ఉన్నా. పంజాబ్ జట్టు ప్రణాళికల గురించి యాజయాన్యంతో జరిపిన చర్చలు చాలా సంతృప్తినిచ్చాయి. ఫ్రాంచైజీపై నమ్మకం పెట్టుకున్న అభిమానుల నమ్మకాన్ని నిజం చేయాల్సిన సమయం వచ్చేసింది. ఇకపై పంజాబ్ కింగ్స్ ఆటలో మార్పు చూస్తారని మేము మీకు ప్రామిస్ చేస్తున్నాం' అని పాంటింగ్ తెలిపాడు.

## అశ్విన్ మాస్టర్ మైండ్.. బిత్తరపోయిన బంగ్లాదేశ్

చెపాక్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ బంగ్లాదేశ్‌కు చుక్కలు చూపిస్తున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటుతో బంగ్లాకు తన తడాఖా చూపించిన అశ్విన్ రెండో ఇన్నింగ్స్‌లో బంతితో చెలరేగుతున్నాడు. తన మాస్టర్ మైండ్‌తో బంగ్లా బ్యాటర్లను పెవిలియన్‌కు చేర్చుతున్నాడు. బ్యాటర్‌ల ఊహకు అందని బంతులు సంధిస్తూ శనివారం ఆట ఆఖరి సెషన్లో మూడు వికెట్లు పడగొట్టాడు. అశ్విన్ మ్యాజిక్‌కు రోహిత్ శర్మ టాప్ ఫీల్డింగ్ సెటప్, ఫీల్డర్ల డైవింగ్ క్యాచ్‌లు జతకావడంతో బంగ్లాదేశ్ బ్యాటర్‌లు నిరాశగా మైదానాన్ని వీడుతున్నారు. కుదురుకున్న ఓపెనర్ షాదాన్ ఇస్లామ్ (35)ను అశ్విన్ తెలివిగా బోల్తా కొట్టించాడు. స్ట్రెట్ డెలివరీ వేస్తూ షాదాన్ ఫ్లిక్ చేసేలా చేశాడు. ఆ తర్వాత మిడ్‌వికెట్‌లో ఉన్న గిల్ గొప్పగా క్యాచ్ పట్టాడు. ఇక మోమినుల్ హక్ (13)ను అశ్విన్ స్టన్నింగ్ డెలివరీతో క్లీన్ బౌల్ చేశాడు. మోమినుల్ డిఫెన్స్‌ను ఛేదించుకుంటూ బంతిని వికెట్లకు సంధించాడు. ఈ బంతిని చూసి మైదానంలో ఉన్న విరాట్ కోహ్లి ఫిదా అయిపోయాడు. టెస్టుల్లో మోమినుల్ను యాష్ ఔట్ చెయ్యడం ఇది నాలుగోసారి. ఆ తర్వాత సిక్సర్ బాది ఊపు మీదున్న ముష్ఫికర్ రహీమ్ (13)ను కూడా అశ్విన్ పెవిలియన్‌కు చేర్చాడు. కేఎల్ రాహుల్ అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు. 11 ఇన్నింగ్స్‌లో ముష్ఫికర్‌ను ఔట్ చేయడం ఇది అయిదో సారి. కాగా, మూడో రోజు ఆట ముగిసేసరికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లకు 158 పరుగులు చేసింది. విజయానికి బంగ్లాదేశ్ 357 పరుగులు, భారత్ 6 వికెట్ల దూరంలో ఉంది. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (51 బ్యాటింగ్; 60 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకం సాధించాడు. అంతకుముందు ఓవ్నట్ స్కోరు 81/3తో మూడో రోజు



ఆటను ప్రారంభించిన టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. శుభ్మన్ గిల్ (119 నాటౌట్; 176 బంతుల్లో, 10 ఫోర్లు, 4 సిక్సర్లు), రిషభ్ పంత్ (109; 128 బంతుల్లో, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) శతకాలతో కదం తొక్కారు. బంగ్లా బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ రెండు వికెట్లు, తస్కిన్, నహిద్ తలో వికెట్ తీశారు. కాగా, మొదటి ఇన్నింగ్స్లో భారత్ 376 పరుగులు భారీ స్కోరు చేసింది. రవిచంద్రన్ అశ్విన్ (113), రవీంద్ర జడేజా (86) సత్తా చాటారు. హసన్ మహ్మద్ (5/83) అయిదు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్ 149 పరుగులకే కుప్పకూలింది. షకిబ్ అల్ హసన్ (32) టాప్ స్కోరర్. జస్ప్రీత్ బుమ్రా (4/50) నాలుగు వికెట్లు తీశాడు.

## శుభ్‌మన్ గిల్ సెంచరీ.. భారత్ సెకండ్ ఇన్నింగ్స్ డిక్లేర్!



చెపాక్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్‌కు భారత్ 515 పరుగలు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. శుభ్‌మన్ గిల్ (119 నాటౌట్; 176 బంతుల్లో, 10 ఫోర్లు, 4 సిక్సర్లు), రిషభ్ పంత్ (109; 128 బంతుల్లో, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) శతకాలతో కదం తొక్కడంతో.. రెండో ఇన్నింగ్స్‌ను టీమిండియా 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవ్నట్ స్కోరు 81/3తో శనివారం ఆటను ఆరంభించిన పంత్, గిల్ సాధికారికంగా ఆడారు. చక్కని బంతులని గౌరవిస్తూ బౌండరీ, సిక్సర్లతో స్కోరుబోర్డు ముందుకు నడిపించారు. 79 బంతుల్లో గిల్, 88 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీ సాధించారు. 50 మార్క్‌ను దాటిన తర్వాత గేర్ మార్చి మరింత దూకుడుగా ఆడారు. పంత్ 124 బంతుల్లో శతకాన్ని అందుకున్నాడు. టెస్టు ఫార్మాట్లో పంత్కు ఇది ఆరో సెంచరీ. అయితే సెంచరీ సాధించిన అనంతరం పంత్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. మరోవైపు గిల్ నిలకడగా ఆడుతూ శతకం అందుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన గిల్ రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగాడు. 161 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకున్నాడు. టెస్టు ఫార్మాట్లో గిల్కు ఇది అయిదో శతకం. ఓవరాల్‌గా గిల్‌కు ఇది 12వ ఇంటర్నేషనల్ సెంచరీ. పంత్‌తో కలిసి గిల్ నాలుగో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కేఎల్ రాహుల్ (22 నాటౌట్; 19 బంతుల్లో, 4 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. బంగ్లా బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ రెండు వికెట్లు, తస్కిన్, నహిద్ తలో వికెట్ తీశారు. కాగా, మొదటి ఇన్నింగ్స్‌ల్లో భారత్ 376 పరుగులు భారీ స్కోరు చేసింది. రవిచంద్రన్ అశ్విన్ (113), రవీంద్ర జడేజా (86) సత్తాచాటారు. హసన్ మహ్మద్ (5/83) అయిదు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్కు వచ్చిన బంగ్లాదేశ్.. జస్ప్రీత్ బుమ్రా (4/50), ఆకాశ్‌దీప్ (2/19), రవీంద్ర జడేజా (2/19), మహమ్మద్ సిరాజ్ (2/30)ల ధాటికి 149 పరుగులకే కుప్పకూలింది. షకిబ్ అల్ హసన్ (32) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 227 పరుగుల ఆధిక్యం దక్కింది.

## చరిత్ర సృష్టించిన పంత్.. ధోనీ రికార్డు సమం!



632 రోజుల తర్వాత టెస్టు ఫార్మాట్‌లో రీఎంట్రీ ఇచ్చిన టీమిండియా యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ శతకంతో చెలరేగాడు. చెపాక్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వన్డే తరహా బ్యాటింగ్‌తో సెంచరీ సాధించాడు. 124 బంతుల్లో 11 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో మూడంకెల స్కోరు అందుకున్నాడు. టెస్టు ఫార్మాట్లో పంత్‌కు ఇది ఆరో సెంచరీ. ఈ క్రమంలో పంత్ అరుదైన ఘనత సాధించాడు. భారత్ తరఫున టెస్టు ఫార్మాట్లో అత్యధిక సెంచరీలు సాధించిన వికెట్ కీపర్గా మహేంద్ర సింగ్ ధోనీతో పంత్ సమంగా నిలిచాడు. 58 ఇన్నింగ్స్‌లో పంత్ ఆరు శతకాలు బాదగా, ఎంఎస్ ధోనీ 144 ఇన్నింగ్స్‌లో ఆరు సెంచరీలు అందుకున్నాడు. ఇక మూడో స్థానంలో వృద్ధిమాన్ సాహా ఉన్నాడు. సాహా 54 ఇన్నింగ్స్‌లో మూడు శతకాలు సాధించాడు. అయితే శతకం సాధించిన కాసేపటికే పంత్ (109; 128 బంతుల్లో, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) పెవిలియన్‌కు చేరాడు. మెహది హసన్ మిరాజ్ బౌలింగ్‌లో షాట్‌కు యత్నించి రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్ లోనూ పంత్ కీలక పరుగులు సాధించాడు. 34 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో నిలిచిన జట్టును ఆదుకున్నాడు. 52 బంతుల్లో 39 పరుగులతో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. కాగా, రెండో ఇన్నింగ్స్‌ను టీమిండియా 287/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లోని 227 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకుని బంగ్లాదేశ్‌కు భారత్ 515 పరుగులు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. పంత్తో పాటు శుభ్మన్ గిల్ (119 నాటౌట్; 176 బంతుల్లో, 10 ఫోర్లు, 4 సిక్సర్లు) కూడా శతకంతో కదం తొక్కాడు. కేఎల్ రాహుల్ (22 నాటౌట్; 19 బంతుల్లో, 4 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. బంగ్లా బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ రెండు వికెట్లు, తస్కిన్, నహిద్ తలో వికెట్ తీశారు. కాగా, మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులు భారీ స్కోరు చేసింది. రవిచంద్రన్ అశ్విన్ (113), రవీంద్ర జడేజా (86) సత్తా చాటారు. హసన్ మహ్మద్ (5/83) అయిదు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన బంగ్లాదేశ్.. జస్ప్రీత్ బుమ్రా (4/50), ఆకాశ్దీప్ (2/19), రవీంద్ర జడేజా (2/19), మహమ్మద్ సిరాజ్ (2/30)ల ధాటికి 149 పరుగులకే కుప్పకూలింది. షకిబ్ అల్ హసన్ (32) టాప్ స్కోరర్.

## 'దేవర' టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతి

### చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎన్టీఆర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా సందడి మరో ఆరు రోజుల్లో షురూ కానున్న విషయం తెలిసిందే. నందమూరి అభిమానులతో పాటు టాలీవుడ్ ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు ఈ సినిమా కోసం. కొరటాల శివ దర్శకత్వంలో వస్తున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమాకి టిక్కెట్ల రేటు పెంచడానికి ఏపీ ప్రభుత్వం అనుమతించింది. దేవర రిలీజ్ రోజు ఆరు షోలతో పాటు మల్టీప్లెక్స్‌లో ఒక్కో టికెట్లపై రూ.135 వరకూ, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో అప్పర్ క్లాస్ ఒక్కో టికెట్ పై రూ.110, లోయర్ క్లాస్ ఒక్కో టికెట్టైపై రూ.60 వరకూ పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చింది. అలాగే 28వ తేదీ నుంచి 9 రోజులపాటు రోజుకు 5 షోల చొప్పున ప్రదర్శనకు అనుమతి ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. అయితే ఈ విషయంపై ఏపీ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు తారక్. గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌గారికి ధన్యవాదాలు. 'దేవర' సినిమా విడుదల నేపథ్యంలో టికెట్ ధరలు పెంపునకు, స్పెషల్ షోల ప్రదర్శనకు అనుమతి ఇస్తూ ఏపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. తెలుగు సినిమాకు సహకారం అందిస్తున్న మీకు కృతజ్ఞతలు. సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌గారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా అంటూ తారక్ రాసుకొచ్చాడు.

## ప్రభాస్‌పై మాళవిక ప్రశంసలు


వరుస విజయాలతో జోష్ మీదున్న ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్'తో బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో సిద్ధమవుతోన్న చిత్రమిది. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో ఇది తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమారి తదితరులు ఆడి పాడనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి మాళవిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన తాజా చిత్రం 'యుధ్రా' ప్రచారంలో పాల్గొన్న ఆమె 'రాజాసాబ్' షూటింగ్‌పై ఓ అప్‌డేట్ ఇచ్చారు. ''రాజాసాబ్ రొమాంటిక్ కామెడీగా రానుంది. నేను ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఇప్పటివరకు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశాను. ఇందులో నా పాత్రకు ప్రాధాన్యం ఉంది. ఇలాంటి సినిమాలో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా ఇది ముస్తాబవుతోంది. ప్రస్తుతం సగం షూటింగ్ పూర్తయింది. ప్రభాస్‌ఇంటి భోజనానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. భోజనమంటే ఏదో ఒక కర్రీ, బిర్యానీ తెప్పించడం కాదు.. ఏకంగా పెద్దపెద్ద పాత్రల్లో ఒక గ్రామానికి సరిపోయేంత ఆహారాన్ని ఏర్పాటు చేస్తాడు. ఇప్పటివరకు నేను అలాంటి రుచికరమైన ఆహారాన్ని తినలేదు'' అంటూ ప్రభాస్‌పై మాళవిక ప్రశంసలు కురిపించారు.



## జానీ మాస్టర్ కేసులో మరో ట్విస్ట్.. భార్యపై కేసు.?

టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ డ్యాన్సర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన వివాదం సినీ ఇండస్ట్రీలో చర్చయానీయాంశమైన విషయం తెలిసిందే. ఈ వివాదంలో జానీ మాస్టర్‌పై ఐపీసీ సెక్షన్ 376, 506, 323(2)తోపాటు పోక్సో కేసులు నమోదు కాగా.. దీనిపై విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అక్టోబర్ 3 వరకు రిమాండ్‌లో ఉంచాలని ఆదేశించింది. దీంతో జానీని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అయితే ఈ ఈ వ్యవహారంలో జానీ మాస్టర్‌తో పాటు అతడి భార్య అయేషా అలియాస్ సుమలత చుట్టూ కూడా ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తుంది. సుమలత మీదా కూడా పోలీసులు కేసు నమోదు చేసేందుకు రెడీ అయినట్లు తెలుస్తుంది. తన భర్తపై ఆరోపణలు చేసినందుకు లేడీ కొరియోగ్రాఫర్ ఇంటికి వెళ్లిన జానీ భార్య సుమలత ఆమెపై దాడి చేసినట్లు సమాచారం. జానీ మాస్టర్‌తో కలిసి లేడీ కొరియోగ్రాఫర్ ఇంటికి వెళ్ళిన సుమలత ఆమెపై దాడి చేసి వేధించినట్లు ఈ విషయం బయటకు చెబితే నీ కెరీర్ నాశనం చేస్తామని వార్నింగ్ ఇచ్చినట్లు అత్యాచార బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఈ కేసులో జానీతో పాటు అతడి భార్యను అలాగే మరో ఇద్దరిని నిందితులుగా చేర్చాలని పోలీసులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## వెంకటేష్ - అనిల్ రావిపూడి మూవీ సెట్స్‌లో సందడి చేసిన బాలకృష్ణ



టాలీవుడ్ సీనియర్ నటులు నందమూరి బాలకృష్ణ, విక్టరీ వెంకటేష్‌లు ఒకే చోట కలుసుకున్నారు. రామోజీ ఫిలిం సిటీ వేదికగా అనిల్ రావిపూడి - వెంకటేశ్ ప్రాజెక్ట్ షూటింగ్ జరుగుతుండగా.. ఈ షూటింగ్ సెట్స్‌లో బాలయ్య వచ్చి సందడి చేశాడు. భగవంత్ కేసరితో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త ప్రాజెక్ట్ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. టాలీవుడ్ సీనియర్ నటుడు విక్టరీ వెంకటేశ్ స్టార్ అనిల్ రావిపూడి కాంబోలో ఈ మూవీ తెరకెక్కబోతుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం రాబోతుంది. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ చిత్రం కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రానుంది. ఇప్పటికే తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో ఉన్న దర్బార్ హాల్లో ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సెట్స్‌లో నందమూరి బాలకృష్ణ వచ్చి అందరికి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. అనంతరం వెంకటేశ్, అనిల్ రావిపూడితో కలిసి ముచ్చటించాడు బాలయ్య. ఇక బాలయ్య సెట్స్‌కి వచ్చిన ఫొటోలను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.